


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...


తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 07 సంచిక : 290 అమలాపురం ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ శనివారం 8 జూన్ 2024 పేజీల : 12 వెల : 2/-

## ఎన్డీయేకు మోడీ కొత్త అర్థం



న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ : ఎన్డీయే కూటమిగా పిలుచుకునే బీజేపీ దాని మిత్రపక్షాల కూటమి మొత్తాన్ని మోడీనే వన్ మ్యాన్ షో చేస్తుంటారన్నది తెలిసిందే. ఇంతకూ ఎన్డీయే కూటమి పూర్తి అర్థం ఏమిటన్నది చూస్తే.. జాతీయ ప్రజాస్వామ్య కూటమి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే పేరులో కనిపించే ప్రజాస్వామ్యం కూటమిలో ఉండదు. 2014, 2019లో రెండుసార్లు బీజేపీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు మిగతా 2లో



## అక్షర యోధుడు అస్తమయం

### ఈనాడు రామోజీ రావు కన్నుమూత

హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ ఈనాడు గ్రూప్ ఆఫ్ సంస్థల అధినేత, ప్రముఖ నిర్మాత రామోజీ రావు కన్నుమూశారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ తెల్లవారు జామున తుదిశ్వాస విడిచారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఈ నెల 5వ తేదీన ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు చికిత్స తీసుకున్నారు. అయినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. శుక్రవారం రాత్రి ఇంటెన్సివ్ మిగతా 2లో

## జగన్‌కు సోనియా ఫోన్!




న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ : స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత సోనియా గాంధీ.. జగన్ కు ఫోన్ చేసి ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని కోరినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ లోక్ సభ ఎన్నికల్లో 400 స్థానాలు సాధించాలని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఉవ్విళ్లూరింది. అయితే చావు తప్పి కన్నులొట్టబోయినట్టు మెజారిటీ (272) మిగతా 2లో

# ఏపీలో కూటమి ఆట మొదలైంది



**అటు అధికారులు..**
**ఇటు కార్పొరేషన్ల చైర్మన్లు..**
**తుడిచి పట్టేస్తున్న కూటమి!**

**రాజమండ్రిలో ఫ్లైఓవర్ శిలాఫలకం ధ్వంసం!**






**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** కూటమి ప్రభుత్వం ఇంకా అధికారం చేపట్టకముందే.. అటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సహా.. ఇటు కార్పొరేషన్ల పదవుల విషయంలో సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటి వరకు సీఎంవోలో పనిచేసిన అందరు అధికారులను కూడా తీసి పక్కన పెట్టేసింది. సీనియర్ మోస్ట్ అదికారుల నుంచి జూనియర్ల వరకు కూడా.. సీఎంవోలో పనిచేసిన వారిని వెంటనే జీఏడీలో రిపోర్టు చేసి.. సీట్లు ఖాళీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన.. నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. దీంతో పూనం మాలకొండయ్య, భరత్ గుప్తా, రేవు ముత్యాలరాజులను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తప్పుకోవాలని సూచించారు. దీంతో వారు తమ తమ స్థానాలను ఖాళీ చేశారు. ఇదేసమయంలో వారి వారి ఛాంబర్లనుంచి ముఖ్యమైన ఫైళ్లను కూడా.. తీసుకువెళ్లడానికి వీల్లేదని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇక, రాష్ట్రంలో వైసీపీ సర్కారు ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్ల పై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆయా కార్పొరేషన్లకు చెందిన చైర్మన్లను, వైస్ చైర్మన్లను కూడా.. తక్షణమే ఖాళీ చేయాలని.. ఆయా పదవులకు రాజీనామాలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. రాష్ట్రంలోని మిగతా 2లో

## పవన్ ఓ పెను తుఫాన్

### జనసేనానిపై మోదీ సంచలన వ్యాఖ్యలు!



న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ ఇప్పుడు ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ సైతం పవన్ కళ్యాణ్ పై ప్రశంసలు కురిపించారు. పవన్ కాదు.. తుఫాన్ అంటూ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జన సేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అధికార వైసీపీని 11 ఎమ్మెల్యే మిగతా 2లో

## రాజకీయ అగ్నిలో 'నీట్' మంటలు



న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ : పేపర్ లీక్.. రిజల్ట్ తేడా.. ఎంబీబీఎస్ వంటి గొప్ప చదువులోకి ప్రవేశం కల్పించే నీట్ ప్రవేశ పరీక్ష ఈ ఏడాది అత్యంత వివాదం రేపుతోంది. ఎంబీబీఎస్ వంటి గొప్ప చదువులోకి ప్రవేశం కల్పించే నీట్ ప్రవేశ పరీక్ష ఈ ఏడాది అత్యంత వివాదం రేపుతోంది. మే 5న నీట్ జరగ్గా.. ఫలితాలు ఈ నెల 4న విడుదలయ్యాయి. అయితే, వీటిపై ఇప్పటికే పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నీట్ నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) స్పందించాలంటూ మిగతా 2లో

## పిఠాపురంలో 'వర్మ' వాహనంపై దాడి




పిఠాపురం, విశ్వంవాయిస్ న్యూస్ : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు ఎస్‌వీఎస్ ఎన్ వర్మపై దాడి చేశారు. విజయవాడ నుంచి పిఠాపురం వెళ్లిన ఆయన వాహనంపై రాళ్లు, కర్రలతో దాడి చేయడం అందరూ విస్తు బోయారు. అయితే.. ఈ దాడిలో వర్మ తృటిలో తప్పించుకున్నారు. దీంతో ఆయన కారు అద్దాలను.. ధ్వంసం మిగతా 2లో

## కేంద్రంలో టీడీపీ మంత్రులు వీరే ?






**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్** : ఏపీ నుంచి కేంద్ర మంత్రులుగా టీడీపీ కోటాలో నలుగురు జనసేన కోటలో ఒకరు ప్రమాణం చేసే అవకాశం ఉంది. ఈ నెల 9న రాత్రి ఏడున్నర గంటలకు కేంద్ర మంత్రివర్గం ప్రమాణం చేయనుంది. ప్రధాని నరేంద్ర మోడీతో పాటుగా అరవై మందికి తక్కువ లేకుండా మంత్రులు ప్రమాణం చేయనున్నారు. ఏపీ నుంచి కేంద్ర మంత్రులుగా టీడీపీ కోటాలో నలుగురు జనసేన కోటలో ఒకరు ప్రమాణం చేసే అవకాశం ఉంది. అలాగే బీజేపీ నుంచి ఒకరూ లేదా ఇద్దరు మంత్రులు కావచ్చు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో శుక్రవారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబు సుదీర్ఘంగా మంత్రివర్గంలో చర్చించారు. మంత్రివర్గంలో చేరే టీడీపీ ఎంపీల విషయంలోనూ క్లారిటీ వచ్చినట్లుగా చెబుతున్నారు. నడ్డా నివాసానికి బాబుతో పాటు టీడీపీ ఎంపీ కింజరాపు రామ్మోహన్ కూడా ఒకే కారులో వెళ్ళారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ నుంచి నలుగురు చేరుతారు అని అంటున్నారు. వారిలో ఇద్దరికి క్యాబినెట్ బెర్తులు దక్కుతాయి అని తెలుస్తోంది. అలాగే మరో ఇద్దరికి సహాయ మంత్రులు దక్కుతాయని అంటున్నారు. క్యాబినెట్ మంత్రుల జాబితాలో గుంటూరు నుంచి టీడీపీ ఎంపీగా గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఈయన అమెరికాలో బడా పారిశ్రామికవేత్త. తన నామినేషన్ పత్రాల మీద వేల కోట్ల ఆస్తులు ఓపెన్ గా రాసిన ఈయన అప్పట్లో సెన్సేషన్ అయ్యారు. ఈయనకు కేంద్ర మంత్రివర్గంలో చోటిస్తే ఏపీకి భారీ ఎత్తున పరిశ్రమలు తెస్తారని బాబు భావిస్తున్నారుట. ఈయన మిగతా 2లో

## అయోమయంలో వాలంటీర్లు




హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ ఏపీలో ప్రజలు వైసీపీకి ఊహించని షాక్ ఇవ్వడంతో పాటు కూటమికి సైతం ఊహించని మెజారిటీ కట్టబెట్టారనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతున్న పరిస్థితి. ఈ సమయలో భారీ మెజారిటీతో కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీ శ్రేణులపై దాడులు, ఆ నేతల పేర్లున్న శిలాపలకాలు ధ్వంసం చేయడం వంటి కార్యక్రమాలు నడుస్తున్నాయి. దీంతో... వాలంటీర్ వ్యవస్థ కొనసాగడం అనే విషయంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయని అంటున్నారు. అవును... ఏపీలో వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా కట్టబెట్టకపోవడంతో... ఇక చంద్రబాబు తీసుకునే నిర్ణయాలకు ఏమాత్రం ఆటంకాలు ఉండవనే చర్చ ఏపీలో బలంగా వినిపిస్తుంది. దానికి తోడు కేంద్రంలోనూ అధికారంలో ఉన్నది కూటమే కావడంతో అటు నుంచి కూడా ఎలాంటి ఇబ్బందులూ ఉండవని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో... ఎన్నికల సమయంలో వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు, అనంతరం ఇచ్చిన హామీలపై చర్చ మొదలైంది. ఏపీలో ఫలితాలు వెలువడిన వెంటనే స్పందించిన మాజీ మంత్రి మిగతా 2లో

## కేంద్రంలో ట్రిపుల్ ఎన్ సర్కార్ ?



న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ : ట్రిపుల్ ఆర్ మూవీ సూపర్ హిట్. అప్పటి నుంచి ట్రిపుల్ ఆర్ పాపులర్ అయింది. ఎవరైనా మూడు ఆర్ తో కలిపి పేరు ఉంటే వారిని షార్ట్ కట్ లో ట్రిపుల్ ఆర్ అని పిలవడం అలవాటు అయిపోయింది. అయితే ఈసారి కేంద్రంలో ప్రధానిగా ప్రమాణం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ఎన్డీయే ప్రభుత్వం అని పిలుస్తారు. ఎందుకంటే అందులో ఎన్డీయే భాగస్వాములు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి మద్దతుతోనే ప్రభుత్వం ఏర్పాటు అవుతోంది కాబట్టి. అలా ఎన్డీయే సర్కార్ అని పిలుచుకోవచ్చు. కానీ ట్రిపుల్ ఎన్ సర్కార్ అని దీనికి కొత్త పేరు పెట్టేస్తున్నారు. ట్రిపుల్ ఎన్ ఏంటి అంటే అక్కడే ఉంది అసలు స్టోరీ. ట్రిపుల్ ఎన్ లలో ఒక ఎన్ అంటే నరేంద్ర మోడీ మరో ఎన్ అంటే నాయుడు అదే మన చంద్రబాబు నాయుడు. మూడవ ఎన్ నితీష్ కుమార్ బీహారీ బాబు. ఈ ముగ్గురూ కలిస్తేనే ఏర్పడిన సర్కార్ కాబట్టి దీనిని ట్రిపుల్ ఎన్ సర్కార్ అని అపుడే జాతీయ మీడియాలో వైరల్ అవుతోంది. దీన్ని సెటైరికల్ గా కాంగ్రెస్ కూడా విమర్శిస్తూ ప్రచారం చేస్తోంది. నరేంద్ర నాయుడు నితీష్ సర్కార్ ఏర్పడుతుంది ఇది ఎంతకాలం ఉంటుందో అని కాంగ్రెస్ అపుడే అపశకునం పలుకుతోంది. ట్రిపుల్ ఎన్ సర్కార్ విషయంలో చాలా సందేహాలు ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అంటున్నారు. ఈ ప్రభుత్వం ముచ్చటగా గద్దెనెక్కినా ఎంతకాలం ఉంటుంది అన్నది చూడాలని అంటున్నారు. మోడీ మూడోసారి ప్రధాని అవుతారేమో కానీ పూర్తి కాలం ఉండలేరు అని కూడా కాంగ్రెస్ అంటోంది. దానికి కారణం బీజేపీకి పూర్తి మెజారిటీ మిగతా 2లో

# ఎడిటర్ వాయిస్

## ధరాభారం

దేశ వ్యాప్తంగా ప్రజానీకం ఎన్నికల హడావిడిలో మునిగిఉన్న వేళ కేంద్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా భారీ భారాన్ని మోపింది. కౌంటింగ్ కూడా జరగక ముందే కేంద్రం మోపిన ఈ భారాన్ని అత్యధికమంది ప్రజానీకం గుర్తించనే లేదు. జేబులు ఖాళీ కావడం ప్రారంభమైన తరువాతే అత్యధికులు ఈ భారాన్ని గుర్తించారు. ఇటువంటి వంచనా విన్యాసాలు నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వానికి కొత్తేమీ కాదు. గతంలో కూడా ఈ తరహా అనుభవాలు ముఖ్యంగా పెట్రో ఉత్పత్తుల ధరల విషయలో దేశ ప్రజానీకానికి ఉన్నాయి. ఎప్పటికప్పుడు మోసపు మాటలతో ప్రజానీకాన్ని మభ్య పెట్టే మోడీ ప్రభుత్వం ఈ సారి కూడా అటువంటి పనికే తెగబడింది. లోక్‌సభకు ఏడు విడతల పోలింగ్ ప్రక్రియ జూన్ ఒకటవ తేదీన ముగిసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే (జూన్ 2) దేశ వ్యాప్తంగా టోల్ ఛార్జీలను పెంచింది. అదే రోజు దేశ వ్యాప్తంగా అమూల్, మదర్ డెయిరీ సంస్థలు పాల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఈ రెండూ ప్రభుత్వ నియంత్రణలో ఉండే సంస్థలే కావడం గమనార్హం. ఈ సంస్థలు ధరల పెంపునకు సంబంధించి ప్రతిపాదనలు ఇచ్చి కొన్ని నెలలైనట్లు సమాచారం. ఇంత కాలం ఆ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పక్కన పెట్టిందో, పోలింగ్ ప్రక్రియ ముగిసీ, ముగియగానే ఎందుకు అనుమతిం చిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. టోల్ ఫీజుల సవరణకు సంబంధించిన నిర్ణయం వార్షిక ప్రాతిపదికన జరుగుతుంది. ఈ ఏడాది కూడా దానికి సంబంధించిన ప్రతిపాదనలను గత డిసెంబర్, జనవరి నెలల్లోనే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ) కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. నూతన ఆర్థిక సంవత్సరంలో మొదటిరోజైన ఏప్రిల్ ఒకటి నుండి ఈ ప్రతిపాదనలు అమలులోకి రావాల్సి ఉంది. ఎన్నికల సమయం కావడంతో ఆ ప్రతిపాదనలకు తాత్కాలికంగా నిలుపుదల చేసిన కేంద్ర ప్రభుత్వం పోలింగ్ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు నుండే పెంపునకు గ్రీన్ సిగల్ ఇచ్చింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న 855 టోల్‌ప్లాజాల్లో సగటున 5 శాతం టోల్‌ఫీజు పెరిగింది. ఈ పెంపునకు సంబంధించిన ముందస్తు సమాచారం ఏమాత్రం లేకపోవడంతో అనేక చోట్ల వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కున్నట్లు వార్తలు వచ్చాయి. కనీసం 5 రూపాయల నుండి 20 రూపాయల వరకు రోజువారీ ప్రయాణీకులపైనా, నెల పాస్‌లున్న వారికి రూ100 నుండి 400 రూపాయల వరకు భారం పడినట్లు వార్తలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వశాఖ చేపట్టిన ఏడు పనుల్లో 7.50 లక్షల కోట్ల రూపాయల మేర అవకతవకలు చోటుచేసుకున్నట్లు గత ఏడాది కాగ్ ఇచ్చిన నివేదికలో పేర్కొంది. ఆ నివేదికలోని అంశాలపై ఇంతవరకు నామమాత్రపు చర్యలు కూడా తీసుకోని కేంద్ర ప్రభుత్వం టోల్ ఫీజుల పెంపునకు మాత్రం అనుమతిచ్చింది. పాల ధరల పెంపు విషయంలోనూ ఇంతే. అన్ని రకాల పాలపై లీటరకు రెండు రూపాయల వంతున పెంచుకోవడానికి అమూల్, మదర్ డెయిరీలకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ద్రవ్యోల్బణం పెరుగుతుండటంతో ఉత్పత్తి ఖర్చు పెరగుతోందని, ఫలితంగా ధరలు పెంచాల్సి వస్తోందని ఈ సంస్థలు ప్రభుత్వానికి నివేదించాయి. నెలల తరబడి దేశవ్యాప్తంగా చేసిన ఎన్నికల ప్రచారంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచామని, ధరలను నియంత్రించామని కేంద్ర మంత్రులు చేసిన ప్రచారానికి ఇది విరుద్ధం కావడం గమనార్హం. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ధరల పెంపునకు అనుమతివ్వడంతో కేంద్ర ప్రభుత్వ పెద్దల మాటల్లోని అసలు నిజం బట్టబయలైంది. 2022లో అమూల్ సంస్థ మూడు సార్లు ధరలను పెంచింది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

(మొదటిపేజీ తరువాయి)

## ఎన్డీయేకు మోడీ కొత్త అర్థం

చేసేంత మద్దతును ఓటర్లు ఇవ్వటంతో మిగిలిన కూటమి నేతలకు ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కూరలో కరివేపాకు మాదిరి పక్కన పెట్టేసిన తీరు గడిచిన పదేళ్లలో చూసిందే. టార్గెట్ 400 పేరుతో తాజా ఎన్నికల బరిలోకి దిగినప్పటికీ ఎన్నికల ఫలితాలు మాత్రం అంచనాలకు భిన్నంగా.. షాకింగ్ గా రావటం తెలిసిందే. ముచ్చటగా మూడోసారి అధికారాన్ని చేపట్టాలని తహతహలాడిన మోడీకి.. బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన 272 సీట్లు రాకపోవటం.. మిత్రుల మీద ఆధారపడాల్సి వచ్చింది. అదే సమయంలో చంద్రబాబు.. జనసేన కూటమి దక్కించుకున్న 18 సీట్లు ఇప్పుడు ఎన్డీయేకు ప్రాణవాయువుగా మారాయి. బాబు పక్క చూపులు చూస్తారేమో అనుకున్నప్పటికీ అలాంటిదేమీ లేకుండా.. ఎన్నికల ముందు ఇచ్చిన కమిట్ మెంట్ ను ఇప్పుడు కూడా అదే కంటిన్యూ అవుతానని చెప్పటంతో కేంద్రంలో మోడీ సర్కారుకు రంగం సిద్ధమవుతోంది. తాజాగా ఎన్డీయే కూటమి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ ఎంపీలతో పాటు.. దాని మిత్రపక్షాల ఎంపీలు ఆయా పార్టీల అధినేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంతకాలం ఎన్డీయేకున్న పేరుకు కొత్త అర్థాన్ని చెప్పటం గమనార్హం. గడిచిన ముప్ఫై ఏళ్లలో దేశాన్ని ఎన్డీయే కూటమి మూడుసార్లు పాలించిందని.. మరోసారి ఐదేళ్లు పాలనకు ప్రజలు అవకాశం ఇచ్చినట్లుగా పేర్కొన్నారు. ఎన్డీయే అంటేనే సుపరిపాలన అన్న ఆయన.. ఈ కూటమికి ఇప్పటివరకున్న అర్థానికి భిన్నంగా కొత్త అర్థాన్ని చెప్పుకొచ్చారు. అదేమంటే.. 'న్యూ ఇండియా.. డెవలప్ డ్ ఇండియా.. ఆస్పిరేషనల్ ఇండియా' అంటూ కొత్త భాష్యాన్ని చెప్పుకొచ్చారు. తమ కూటమిని దక్షిణాది ప్రజలు ఆదరించారన్న ఆయన.. కర్ణాటక.. తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని.. అయితే అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైనం తాజాగా వెల్లడైన ఎన్నికల ఫలితాలు చెప్పాయన్నారు. తమిళనాడులో సీట్లు గెలవకున్నా.. ఓట్లు పెరిగిన విషయాన్ని ప్రస్తావించిన ఆయన.. కేరళలో తమ కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారన్నారు. తొలిసారి ఆ రాష్ట్రం నుంచి తమ ప్రతినిధి ఒకరు సభలోకి అడుగు పెడుతున్నట్లు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్.. సిక్కింలో క్లీన్ స్వీప్ చేశామని.. ఏపీ ప్రజలు కూటమికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నట్లుగా చెప్పిన మోడీ.. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలను అద్దం పట్టిందన్నారు. 2024 ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించినా.. విపక్షాలు మాత్రం తమ విజయాన్ని తిరస్కరించే ప్రయత్నం చేశాయన్నారు. తాము ఓడిపోయినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారని.. కానీ తాము ఓడిపోలేదని దేశ ప్రజలకు తెలుసన్నారు. ఇకనైనా విపక్షాలు పార్లమెంట్ లోకి వచ్చి చర్చలో పాల్గొంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ చాలా వేగంగా పతనమవుతుందన్న ఆయన.. పదేళ్ల తర్వాత కూడా ఆ పార్టీ గుణపాఠాలు నేర్చుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో తమ సొంత ప్రధానమంత్రినే అవమానించారన్న మోడీ.. మరో పదేళ్లు దాటిన తర్వాత కూడా వంద సీట్ల సంఖ్యను దాటదని చెప్పటం గమనార్హం.

## అక్షర యోధుడు అస్తమయం

కేర్ యూనిట్‌లో వెంటిలేటర్‌పై రామోజీ రావుకు కృత్రిమ శ్వాసను అందించారు డాక్టర్లు. వారి ప్రయత్నాలు విఫలం అయ్యాయి. ఈ తెల్లవారు జామున ఆయన కన్నుమూశారు. లోక్సభ ఎన్నికలు 2024 నియోజకవర్గాలు ఎ అభ్యర్థులు ఎ ఎన్నికల ఫలితాలు రామోజీ రావుకు తీవ్ర అస్వస్థత: వెంటిలెటర్‌పై చికిత్స తెలుగునాట మీడియా మొఘల్‌గా ఎదిగారు రామోజీ రావు. ఈనాడు దినపత్రిక, ఈటీవీ, ఈటీవీ భారత్ వంటి సంస్థలతో మీడియా రంగంలో సంచలనం సృష్టించారు. తనదైన ముద్ర వేశారు. తన పేరు మీద దేశంలోనే అతిపెద్ద ఫిల్మ్ సిటీని నిర్మించారు. ప్రియా పేరుతో ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ సెగ్మెంట్‌లోనూ ఆయన అడుగులు వేశారు. అక్కడా విజయవంతం అయ్యారు. నిర్మాతగా టాలీవుడ్‌లో ఎన్నో మరపురాని సినిమాలను నిర్మించారు. తెలుగు, బెంగాలీ, హిందీ, కన్నడ, తమిళ భాషల్లో పలు సూపర్ హిట్ సినిమాలను నిర్మించారు. సమాజాన్ని మేలుకొలిపేలా ఆయన సినిమాలు ఉంటాయనే గుర్తింపును పొందారు. మయూరి, ప్రతిఘటన, మౌనపోరాటం వంటి ఎన్నో సందేశాత్మక సినిమాలు వెలవడ్డాయి ఆయన బ్యానర్ నుంచి. రామోజీ రావు మృతిపట్ల పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తోన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తోన్నారు. రాజకీయ, సినిమా, పారిశ్రామిక రంగాలు విషాదంలో మునిగిపోయాయి.

## జగన్‌కు సోనియా ఫోన్!

కంటే 20 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది. బీజేపీ కూటమికి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేయడంతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తారని జరిగిన ప్రచారం బీజేపీ అవకాశాలను భారీగా దెబ్బతీసింది. మరోవైపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తల్లకిందులు చేస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి మంచి ఫలితాలను సాధించింది. కాంగ్రెస్ పార్టీ 99 స్థానాలను సాధించింది. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు మొత్తం 234 సీట్లను గెలుచుకుని మెజారిటీకి 38 సీట్ల దూరంలో నిలిచిపోయాయి. ఇక ఏ కూటమిలోనూ చేరకుండా నిలిచిన పార్టీలు, స్వతంత్రులకు 17 ఎంపీ స్థానాలు దక్కాయి. ఈ నేపథ్యంలో అధికారం చేజిక్కించుకోవడానికి ఉన్న ఏ అవకాశాన్ని పోగొట్టుకోకూడదనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఎన్డీయే కూటమిలో బీజేపీ తర్వాత పెద్ద పార్టీలుగా ఉన్న టీడీపీ, జేడీయూలను కాంగ్రెస్ పార్టీ సంప్రదించిందనే వార్తలు వచ్చాయి. మరోవైపు లోక్ సభ ఎన్నికల్లో నాలుగు స్థానాలు సాధించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను కూడా సంప్రదించారని టాక్ నడుస్తోంది. స్వయంగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత సోనియా గాంధీ.. జగన్ కు ఫోన్ చేసి ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని కోరినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే సోనియా ప్రతిపాదనను జగన్ సున్నితంగా తిరస్కరించారని అంటున్నారు. వాస్తవానికి 2011లో వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ కేంద్రంలో ఏ కూటమిలోనూ చేరలేదు. బీజేపీ, కాంగ్రెస్ కూటమిలకు సమాన దూరాన్నే పాటిస్తూ వచ్చింది. 2019-24 వరకు కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి పలు సందర్భాల్లో వైసీపీ మద్దతు ఇచ్చింది. ముఖ్యంగా రాజ్యసభలో పలు కీలక బిల్లుల ఆమోదానికి మద్దతు తెలిపింది. తాజా ఎన్నికల్లోనూ వైసీపీ రెండు కూటములకు సమాన దూరంలోనే ఉంది. ఏ కూటమిలోనూ చేరలేదు. ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి బొటాబొటీ మెజారిటీ దక్కడం, మరో 40 మంది ఎంపీలను కూడగట్టుకుంటే కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి అవకాశం ఉండటంతో ఆ పార్టీ ఏ చిన్న ప్రయత్నాన్నీ వదులుకోవడం లేదు. ఇందులో భాగంగానే వైసీపీ అధినేత జగన్ కు సోనియా గాంధీ స్వయంగా ఫోన్ చేసి మద్దతు అడిగారనే వార్త హల్చల్ చేస్తోంది. మరోవైపు మహారాష్ట్రలోని సాంగ్లీ నుంచి ఇండిపెండెంట్ గా గెలిచిన విశాల్ పాటిల్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి ఆ పార్టీలో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ 100 ఎంపీ స్థానాలను ఈ ఎన్నికల్లో గెల్చుకున్నట్టయింది.

## ఏపీలో కూటమి ఆట మొదలైంది

అన్ని కార్పొరేషన్లు, అకాడమీలు, ఇతర సంస్థలకు సంబంధించిన నామినేటెడ్ చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల రాజీనామా లను తెప్పించుకొని, వాటిని వెంటనే ఆమోదించాలని సంబంధిత శాఖాధిపతులను ఏపి చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. దీంతో తెలుగు అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి నుంచి సినిమా టోగ్రఫీ వరకు.. అన్ని కార్పొరేషన్లు, 56 సామాజిక వర్గాలకు చెందిన కార్పొరేషన్ల పదవుల వరకు కూడా.. అధికారులు, చైర్మన్లు తమ తమ పదవులకు రాజీనామాలు చేయనున్నారు. కాగా.. వీటిని కూడా.. అత్యంత వేగంగా టీడీపీ, జనసేన నాయకులతో భర్తీ చేయనున్నట్టు సమాచారం.

**టీడీపీ ప్లస్ జనసేన బజ్ లేదా ?**

సచివాలయాల మీద దాడులు అలాగే వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం వంటివి టీడీపీ ప్లస్ జనసేన క్యాడర్ చేయడంలో బిజీ కావడం పట్ల కూడా చర్చ సాగుతోంది. టీడీపీ ప్లస్ జనసేన సూపర్ హిట్ కాంబో. ఇది 2014లోనే కాదు తాజా ఎన్నికల్లోనూ రుజువు అయింది. ఈ రెండు పార్టీలు కలిస్తే అధికారం కచ్చితంగా కలుస్తుంది అని ఏ సర్వేలూ అవసరం లేకుండా తేలుతున్న సత్యం. 2024 లో జరిగిన ఎన్నికల్లో ల్యాండ్ స్లైడ్ విక్టరీని టీడీపీ జనసేన కూటమి సొంతం చేసుకుంది. అది బ్రహ్మాండమైన విజయం అని దేశమంతా ఒకటికి పదిసార్లు అంటోంది. మరి దానికి సంబంధించిన సంబరాలు ఏ రేంజిలో చేయాలి అన్నది కూడా అంతా అంటున్న విషయం. కానీ ఆ సంబరాలు విజయోత్సవాలు పక్కన పెట్టేసి జగన్ కట్టించిన సచివాలయాల మీద క్యాడర్ పడడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది. సచివాలయాల మీద దాడులు అలాగే వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం వంటివి టీడీపీ ప్లస్ జనసేన క్యాడర్ చేయడంలో బిజీ కావడం పట్ల కూడా చర్చ సాగుతోంది. పచ్చ రంగులు తెచ్చి అన్ని భవనాలకూ పూయాలనుకోవడం ఇలాంటివే గత రెండు మూడు రోజులుగా చేస్తున్నారు. నిజంగా ఒక పార్టీ అధికారంలోకి వచ్చింది అంటే ఆ సంతోషాన్ని అంబరం తాకేలా చేసుకోవాలి. పది కాలాలు నిలిచిపోయేలా గ్రాండ్ గా సెలబ్రేషన్స్ చేసుకోవాలి. కానీ అది ఎక్కడా కనిపించలేదు. వెంటనే ప్రతీకార దాడులకు తెగబడడం పట్ల అంత విస్తుబోతున్న నేపథ్యం ఉంది. సంతోషంగా సెలబ్రేషన్స్ చేసుకోవాల్సింది పోయి ద్వేషంతో రాంగ్ డైరెక్షన్ లో తప్పులు చేస్తున్నారు అని అంటున్నారు. నిజానికి విజయం అందించే కిక్కు వేరు. ఆ మజా కంటే మత్తు వేరొకటి లేదు. అలా దానిని నూరు శాతం ఎంజాయ్ చేయాల్సిన చోట ఈ ఆవేశాలు ప్రతీకారాలు అవసరమా అన్న మాట వినిపిస్తోంది. నిజమే ఏపీలో రాజకీయ అలా చీలిపోయి ఉంది. అటూ ఇటూ అంతా మోహరించిన పరిస్థితి ఉంది. గెలిచిన వారిలో ఆ రకమైన గర్వం ఉంటుంది. దానికి విజయాన్ని కలిపి ముందుకు సాగాలి తప్పించి ప్రత్యర్థుల మీద దాడులు చేస్తే వైసీపీ చేసిన తప్పులనే చేస్తే ఉపయోగం ఏమిటి అన్న చర్చ వస్తోంది. ఒంగోలులో జరుగుతున్న దాడుల మీద మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రావు రియాక్ట్ అవుతూ పవన్ కళ్యాణ్ కే నేరుగా అప్పీల్ చేశారు. ప్రతీక రాజకీయాలు వద్దు అని మీరు ఇచ్చిన సందేశం బాగుంది. హర్షణీయం కానీ ఒంగోలు లో మాత్రం అలా పరిస్థితి లేదని ఎక్కడ చూసినా దాడులు జరుగుతున్నాయని దీని మీద దృష్టి పెట్టి ఆపించేలా చూడాలని కోరారు. ఈ విధంగా ఆయన పవన్ మీద ఉన్న ప్రేమతో అభిమానంతో ఈ వినతి చేసినట్లుగా కనిపిస్తోంది. పవన్ భారీ విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే ఇలా ట్వీట్ చేశారు. అదే విధంగా చాలా చోట్ల దాడులు జరుగుతుండడం పట్ల కూడా చర్చ సాగుతోంది. వైసీపీని ప్రజలు ఓడించారు అంటే ఇలాంటి తప్పుడు విధానాలు అనూరించడం వల్లనే అని గుర్తు చేస్తున్నారు. అధికారం శాశ్వతం అని తమకు ఎవరూ సాటి లేరని ఇక జీవిత కాలం తామే ఉంటామని భావించి చేశారా అన్నంతగా వారి అయిదేళ్ళ పాలనలో జరగకూడని అరచకాలు ఎన్నో జరిగిపోయాయి.

## పవన్ ఓ పెను తుఫాన్

4 పార్లమెంటు సీట్లకే కూటమి పరిమితం చేసింది. ఈ నేపథ్యంలో కూటమిపై ఇంటా బయటా ప్రశంసల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా జనసేనాని పవన్ కళ్యాణ్ జాతీయ స్థాయిలో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా మారారు. జాతీయ టీవీ చానెళ్లు పవన్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నాయి. గేమ్ చేంజర్ పవన్ కళ్యాణ్ అని, ఏపీ ఎన్నికల్లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఆయనేనని వ్యాఖ్యానాలు వెలువరిస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా ప్రధాని నరేంద్ర మోదీ సైతం పవన్ కళ్యాణ్ పై ప్రశంసలు కురిపించారు. పవన్ కాదు.. తుఫాన్ అంటూ కొనియాడారు. ఎన్డీయే కూటమి ఎంపీల సమావేశం న్యూఢిల్లీలో జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల అధినేతలు, ఎంపీలు హాజరయ్యారు. టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కూడా వచ్చారు. ఈ భేటీలో తమ నాయకుడిగా నరేంద్ర మోదీని అంతా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ.. పవన్ పై అభినందనల జల్లు కురిపించారు.. 'పవన్ వైపు చూపిస్తూ.. ఇదిగో ఇక్కడ ఉన్నాడే.. ఇతడు పవన్ కాదు.. తుఫాన్' అంటూ ప్రశంసించారు. ఆంధ్రా ప్రజలు తమకు అఖండ విజయం కట్టబెట్టారన్నారు. ప్రధాని మాటలకు పవన్ రెండు చేతులెత్తి నమస్కరించారు. కాగా మొదటి నుంచి ఏపీలో వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వనంటూ పవన్ కళ్యాణ్ చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో టీడీపీతో పొత్తుకు ఆయనే ముందుకు వచ్చారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ లో జైలు పాలయిన చంద్రబాబును కలవడానికి పవన్ రాజమండ్రి జైలుకొచ్చారు. ఆ తర్వాత బయటకు రాగానే పొత్తును ప్రకటించి ఏపీ రాజకీయాలను ఒక్కసారిగా మలుపుతిప్పారు. అలాగే మొదటి నుంచి టీడీపీతో పొత్తుకు సుముఖంగా లేని బీజేపీని కూడా తమ కూటమిలోకి పవన్ కళ్యాణే తీసుకొచ్చారు. ఈ విషయంలో తాను బీజేపీ పెద్దల చేత తిట్లు కూడా తిన్నానని పలుమార్లు పవన్ ఎన్నికల ప్రచార సభల్లోనూ చెప్పారు. బీజేపీ.. టీడీపీ, జనసేన కూటమిలో చేరుతుందా, లేదా అని చివరి వరకు డైలమా ఉండగా.. ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ కృషితో బీజేపీ కూడా చివరి క్షణంలో కూటమిలో కలిసింది. బీజేపీకి ఇవ్వాల్సిన సీట్ల కోసం పవన్ కళ్యాణ్ తన సీట్లను కూడా త్యాగం చేశారు. ముందుగా అనుకున్న ప్రకారం జనసేన 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు సీట్లలో పోటీ చేయాల్సి ఉంది.

## రాజకీయ అగ్నిలో 'నీట్' మంటలు

పట్టుబడుతున్నారు. ఇక మంగళవారం నాటి నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి టాప్ ర్యాంక్ వచ్చింది. ఎన్నికల ఫలితాల రోజునే.. సరిగ్గా ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజునే.. నీట్ ఫలితాలు వెలువడడం కూడా అనుమానాలు రేకెత్తిస్తోంది. ఎన్నికల ఫలితాల రోజు కావడంతో అందరూ ఆ హడావుడిలో ఉంటారని.. నీట్ అక్రమాలను ఎవరూ పట్టించుకోరనే ఉద్దేశంలో ఇలా చేశారనే వ్యాఖ్యలు చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ వదంతులపై ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీ స్పందించారు. ఆయన కూడా ఆరోపణలు చేశారు. విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు కొంగర రవికాంత్ కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. ఇక్కడే అనుమానం.. ఒకే కేంద్రంలో నీట్ రాసిన ఆరుగురికి బై టు బై (720/720) మార్కులు రావడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఇది మరింత ఆజ్యం పోసింది. కాగా, మే 5 సాయంత్రం 4 గంటల సమయంలో ప్రశ్నపత్రం ఇంటర్నెట్ లో హల్ చల్ చేసిందని.. అయితే, అప్పటికే దేశవ్యాప్తంగా పరీక్ష మొదలైందని ఎన్టీఏ స్పష్టం చేసింది. దీంతో పేపర్ లీకేజీ లేదని తేల్చింది. గొంతు విప్పిన ప్రియాంక నీట్ ఫలితాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ అగ్ర నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలోనే పేపర్ లీకేజీపై ప్రియాంక ఆరోపణలు చేశారు. తాజాగా ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితాల వెల్లడి తర్వాత పలువురు విద్యార్థులు ఆత్మహత్యలపై ప్రియాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

## పిఠాపురంలో 'వర్మ' వాహనంపై దాడి

చేసి.. సీటు కవర్లను చించేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనపై జనసేన నాయకులు కూడా విస్తు బోయారు.

**ఏం జరిగింది? :** పిఠాపురంలో నిన్న మొన్నటి వరకు వైసీపీ తరఫున ప్రచారం చేసి.. జనసేన కార్యకర్తలను విమర్శించిన కొందరు నాయకులు, కార్యకర్తలను విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో వర్మ.. టీడీపీలోకి చేర్చుకున్నారు. వారికి పార్టీ కండువా కప్పి.. పార్టీలోకి ఆహ్వానించారు. దీనిని జనసేన కార్యకర్తలు.. ముఖ్యంగా పిఠాపురానికి చెందిన కార్యకర్తలు తీవ్రంగా నిరసించారు. ఈ క్రమంలో పిఠాపురం చేరుకున్న వర్మపై దాడికి ప్రయత్నించారు. అయితే.. ఆయన వారి నుంచి తప్పించుకున్నారు. కారు ధ్వంసమైంది. ఇక, పిఠాపురం టికెట్‌ను త్యాగం చేసి.. మరీ వర్మ ఇక్కడ నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు అవకాశం ఇచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు.. జనసేన అధినేత గెలుపు కోసం ఆయన ప్రయత్నించారు. ఈ క్రమంలో జనసేనతో కలిసి ఆయన పని చేశారు. అప్పటి వరకు బాగానే ఉన్నా.. పిఠాపురంలో పవన్ గెలిచిన తర్వాత.. వర్మకు వ్యతిరేకంగా కొందరు జనసేన కార్యకర్తలు సోషల్ మీడియాలోనూ పోస్టులు పెట్టారు. వర్మ వల్ల గెలవలేదని.. మెగా కుటుంబం ప్రచారంతోనే పవన్ గెలిచారని పేర్కొన్నారు. ఇక, మరికొందరు అగ్ర నేతలు కూడా.. వీరి వాదనను ఖండించలేదు. ఈ క్రమంలో వైసీపీ నేతలను టీడీపీలో చేర్చుకోవడంపై ముఖ్యంగా పిఠాపురానికి చెందిన వారిని చేర్చుకోవడంపై జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. దీనిపై అటు పవన్, ఇటు చంద్రబాబు ఎలా రియాక్ట్ అవుతారనేది చూడాలి.

## కేంద్రంలో టీడీపీ మంత్రులు వీరే ?

గుంటూరు జిల్లా నుంచి గెలిచారు. బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు. దాంతో ఏపీలో పెట్టుబడులు రావాలంటే ఆయన కేంద్ర మంత్రివర్గంలో ఉండడం కరెక్ట్ అని బాబు భావిస్తున్నారుట. ఇక రెండవ పేరు చూస్తే ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు. ఆయన శ్రీకాకుళం నుంచి మూడవసారి ఎంపీగా గెలిచారు. ఆయనకు క్యాబినెట్ ర్యాక్ పదవి ఇస్తారని అంటున్నారు. గతంలో ఆయన తండ్రి చూసిన గ్రామీణాభివృద్ధి శాఖకే రామ్మోహన్ కి దక్కేలా బాబు చక్రం తిప్పుతున్నారు అని అంటున్నారు. కింజరాపు కుటుంబం టీడీపీకి విధేయంగా ఉంటూ వస్తోంది. అది కూడా ప్లస్ పాయింట్. బీసీ సామాజిక వర్గం మరో కీలకమైనది. మూడవ పేరు చూస్తే వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి. ఈయన బడా పారిశ్రామికవేత్త. ఈయన నెల్లూరులో వైసీపీ నుంచి టీడీపీ వైపు రావడంతో మొత్తానికి మొత్తం సీట్లు క్లీన్ స్వీప్ చేశారు. దాంతో ఆయన అంగబలాన్ని అర్థబలాన్ని గుర్తించి ఏ మాత్రం తక్కువ చేయకుండా కేంద్ర మంత్రివర్గంలో చోటిచ్చేలా బాబు పావులు కదుపుతున్నారు. ఆయన ఒకసారి రాజ్యసభ కూడా చేసి ఉన్నందున సహాయ మంత్రి పదవి ఇస్తారా లేక ఇండిపెండెంట్ చార్జితో ఇస్తారా అన్నది చూడాల్సి ఉంది. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా బలమైన ఒక సామాజిక వర్గాన్ని బాబు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లుగా చెబుతున్నారు ఇక చివరిగా మరో మంత్రి పదవిని రాయలసీమకు ఇవ్వాలని నిర్ణయించారుట. ఆ పదవిని అనంతపురం నుంచి ఎంపీగా గెలిచిన అంబికా లక్ష్మీ నారాయణకు ఇస్తారని అంటున్నారు. ఆయన బీసీలలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన వారు. బలహీన వర్గాలలో బలమైన నేతగా ఉన్నారు దాంతో సీమలో పట్టు నిలుపుకోవడానికి బాబు ఆయన పేరుని ప్రతిపాదిస్తున్నారు అని అంటున్నారు. ఇలా టీడీపీ క్యాబినెట్ మంత్రుల లిస్ట్ ఉందని తెలుస్తోంది. అదె సమయంలో జనసేన నుంచి ఇద్దరు ఎంపీలు గెలిచారు. వీరిలో ఒకరిని కేంద్ర మంత్రి పదవి ఇస్తారు. మచిలీపట్నం నుంచి మూడవసారి ఎంపీ అయిన వల్లభనేని బాలశౌరికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కుతుందని అంటున్నారు. ఆయన కూడా బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు. పైగా జనసేన అధినేతకు ఇష్టుడు. ఏపీ నుంచి టీడీపీ జనసేనలలో అయిదురుగు మంత్రులు అవుతారని అంటున్నారు. అలాగే బీజేపీ నుంచి కచ్చితంగా దగ్గుబాటి పురంధేశ్వరికి చాన్స్ ఇస్తారు అంటున్నారు. రెండవ బెర్త్ ఇస్తే కనుక అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కి దక్కవచ్చు అన్నది కూడా వినిపిస్తున్న మాట.

## అయోమయంలో వాలంటీర్లు

గుడివాడ అమర్నాథ్... వాలంటీర్ వ్యవస్థపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... వైసీపీ తీసుకొచ్చిన వాలంటీర్, సచివాలయ వ్యవస్థలే తమ కొంప ముంచాయని తెలిపారు. ప్రధానంగా వాలంటీర్ వ్యవస్థ వల్లే ప్రజలకు – నేతలకూ మధ్య భారీ గ్యాప్ వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో గ్రౌండ్ లెవెల్ లో కార్యకర్తలకూ విలువ దక్కలేదన్నట్లుగా తెలిపారు! ఇదే సమయంలో మాజీమంత్రి సిదిరి అప్పలరాజు కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇందులో భాగంగా... వాలంటీర్ల వల్ల తమకూ – తమ ప్రభుత్వానికీ మధ్య గ్యాప్ ఏర్పడిందని అన్నారు. ఈ వాలంటీర్ వ్యవస్థ వల్ల కొన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలు తమకు సముచిత స్థానం దక్కలేదనే విషయాన్ని వెల్లడించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో... ఏపీలో వాలంటీర్ వ్యవస్థ కొనసాగుతుందా లేదా అనే చర్చ బలంగా జరుగుతుంది. వాస్తవానికి ఎన్నికలకు ముందు ఏపీలో వాలంటీర్ వ్యవస్థపై అటు చంద్రబాబు, ఇటు పవన్ కల్యాణ్ లు తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. అయితే ఎన్నికలు సమీపించిన వేళ వారి జీతం రూ.10,000 ఇస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ కొంతమంది రాజీనామా చేసినా ఇంకా 2 లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు! ప్రధానంగా వాలంటీర్ వ్యవస్థ వల్ల ప్రధానంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందనే మాటలు కూడా ఒకవైపు నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాలంటీర్ వ్యవస్థను చంద్రబాబు కంటిన్యూ చేస్తారా.. చెప్పినట్లుగానే 10,000 రూపాయల జీతం ఇస్తారా.. లేక, ఆ వ్యవస్థను రద్దు చేసే ఆలోచన చేస్తారా అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

## కేంద్రంలో ట్రిపుల్ ఎన్ సర్కార్ ?

లేకపోవడం మద్దతు ఇస్తున్న నాయుడు నితీష్ ల వైఖరి కూడా అనుమానాస్పదంగా ఉండడమే అని అంటున్నారు. నితీష్ ఎపుడు ఏ వైపు ఉంటారో ఎవరికి తెలుసు అని అంటున్నారు. ఆయనకు ఇప్పటికే ఇండియా కూటమి నుంచి ఉప ప్రధాని ఆఫర్ ఉంది. ఇంకా డిమాండ్ చేస్తే ప్రధాని ఆఫర్ అయినా ఇస్తారేమో. అయితే వెయిట్ అండ్ సీ అన్న ఆలోచనలో ఆయన ముందుగా మోడీ వైపే ఉన్నారు. మోడీని వీడి పోను అంటున్నారు. ఎన్డీయే పక్ష సమావేశంలో మోడీని ఆకాశానికి ఎత్తేస్తున్నారు నితీష్. ఇక నాయుడు కూడా అంతే చంద్రబాబు నాయుడు అయితే మోడీని విజనరీ అని కొనియాడుతున్నారు ఆయన లేని దేశాన్ని ఊహించలేమని అంటున్నారు. అంతా బాగానే ఉంది కానీ ఎక్కడైనా తేడా వస్తే ఆ ఊతకర్రలు కాస్తా నాయుడు నితీష్ లాగేసుకుంటే అపుడు ట్రిపుల్ ఎన్ సర్కార్ ఏమవుతుంది అన్నది అందరికీ తెలిసిందే. ఆ రోజులు ఎంతో దూరంలో లేవని కాంగ్రెస్ అంటోంది. తాము ఈ టెర్మ్ లోనే అధికారంలోకి వస్తామని 230 సీట్లకు పాగా వేసిన ఇండియా కూటమి గట్టిగానే చెబుతోంది. మొత్తానికి ఈ నెల 9న కేంద్రంలో ఏర్పడబోయేది మాత్రం ట్రిపుల్ ఎన్ సర్కార్ అన్న మాట.

# కక్ష సాధింపు చర్యలు వద్దు

## ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు సమన్వయం పాటించండి

### జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ విన్నపం



**జగ్గంపేట,విశ్వం వాయిస్ న్యూస్:**
స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఢిల్లీలో ఎన్డీఏ పక్ష సమా వేశాలతో తీరిక లేకుండా గడుపుతున్న మా నాయకుడు చంద్రబాబు సూచనలతో శుక్రవారం ఈ సమావేశం ఏర్పాటు చేశామని ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎక్కడ దాడులకు పాల్పడవద్దని తెలియజేశారు. ప్రజలు మనకు తిరుగులేని విజయాన్ని ఇచ్చారని కాబట్టి ఆనందంతో విజయోత్సవాలు జరుపుకొని తప్ప భౌతిక దాడులు, ఆస్తులపై దాడులు చేయవద్దని వారు గత ఐదు సంవత్సరాలుగా చేసిన అరాచకాలకు ఫలితంగానే ప్రజలు ఎంతటి తీర్పునిచ్చారని కాబట్టి ఎన్డీఏ భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వీరం రెడ్డి కాశిబాబు, జగ్గంపేట నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడాల రాంబాబు, కిర్లంపూడి మండల తెలుగు రైతు అధ్యక్షులు కాకిలేటి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ నేతలు పుట్టినరోజు వేడుకలు

**అంబాజీపేట ( విశ్వం వాయిస్ న్యూస్) :**
తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి బొంతు పెదబాబు పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహంలో శుక్రవారం తెదేపా నేతలు అంబాజీపేటలో ఘనంగా నిర్వహించారు. పుల్లేటికుర్రులో మాజీ ఎంపీపీ, పి గన్నవరం నియోజకవర్గం తెదేపా కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ ( డి వి ) పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగృహంలో తెదేపా నేతలు ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా టిడిపి నాయకులు పెదబాబుకు , దాసరి వీర వెంకట సత్యనారాయణకు దుస్సాలువ వేసి పూలదండలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమాలలో తెలుగుదేశం నేతలతో పాటు , జనసేన , బిజెపి నాయకులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో పి.గన్నవరం నియోజవర్గం కన్వీనర్ నామన రాంబాబు , రాష్ట్ర కార్యదర్శి డొక్కా నాథ బాబు , గణపతి వీర రాఘవులు , ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు , ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య , పుల్లేటికుర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, దొమ్మేటి సురేష్ , అంబాజీపేట మండలం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యాళ్ల సత్యనారాయణ, పసుమెల్ల గ్రామానికి చెందిన పెట్టా కృష్ణ కిషోర్, కె. పెదపూడి కి చెందిన మోకా శీను, మోర్త సాయి . యనమదల రాజబాబు , దొమ్మేటి ప్రభాకర్, నేదునూరు బాబులు, కాసా నాగ మలేశ్వరావు. అంకయ్య అందే సుబ్రహ్మణ్యం, వీర శీను ఉప్పలగుప్తం సురేష్ , గణపతి వీర రాఘవులు పెదపూడి శ్రీనివాసరావు, పిచ్చెట్ల హరిబాబు, చుట్టూరి హరికృష్ణ, నందయ్య , కటకం భద్ర రావు, నాయకులు అభిమానులు కార్యకర్తలు ఆయా కార్యక్రమాలో పాల్గొన్నారు.





# మిగుల సీట్ల భర్తీకి
# దరఖాస్తుల స్వీకరణ

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :**
ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలలోని మహాత్మ జ్యోతిభాపులే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6,7,8,9 తరగతుల్లో మిగులుగా ఉన్న సీట్ల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆ పాఠశాలల కన్వీనర్ డా.వై.టి.ఎస్. రాజు శు క్రవారం ఓ ప్రకటన విడుదల చేసారు. జిల్లాలలోని బాలి కలకు రామచంద్రాపురం, రాజమండ్రి, మరియు బాలురకు అమలాపురం, కరప, తుని, పెద్దాపురం, అనపర్తి పాఠశాలలో మిగిలిన సీట్లకు గాను ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 15 లోపు వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కన్వీనర్ పాఠశాల అమలా పురం(సమనస)లో ఈ నెల 15వ తేదీన ప్రవేశ పరిక్ష ఉంటుందని ఆయన తెలిపారు. పూర్తీ సమాచారా నికి9866195979 (అమలాపురం),9849642721(కరప),8977008697(తుని),6309813777(రామచంద్రాపురం), 9866065425 (పెద్దాపురం), 8790257894 (అనపర్తి), 9652818307(రాజమండ్రి) నెంబర్లలో సంప్రదించవచ్చు.

# హస్తకళా ప్రదర్శన,అమ్మకం ప్రారంభం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :**
కాకినాడ రూరల్ డీసీసీ బ్యాంకు ప్రక్కన క్రాఫ్ట్ బజార్ ఉన్న ఖాళీ స్థలంలో 50,000 వెరైటీస్ మాస్తకళలు మరియు చేనేత ఎంపోరియం క్రాఫ్ట్ బజార్ ఈనెల 7 నుండి 20 రోజులు వరకు క్రాఫ్ట్ బజార్ పేరుతో నిర్వహించబడుతుంది. ఈ హస్తకళా ప్రదర్శన,అమ్మకాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యాపారవేత్త దుర్గ సోము ప్రసాద్ ప్రారంభించినారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హస్తకళలు, చేనేత వస్తువులు ఉత్పత్తి ధరలకు విక్రయిస్తుండడంతో వినియోగదారులకు సరసమైన ధరలకు లభించే అవకాశం ఉన్నదన్నారు. వృత్తి కళాకారులకు ముఖ్యంగా చేనేత హస్తకళా ఉత్పత్తి దారులను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉన్నదన్నారు క్రాఫ్ట్ టజార్ పేరుతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభ్యమయ్యే వస్తువులను ఒకచోటకు తెచ్చి ప్రదర్శించడం, విక్రయిస్తుండడం ఒక ప్రత్యేక కళ అన్నారు. కాకినాడ కాకినాడ రురల్ ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్రాఫ్ట్ బజార్ అధ్యక్షులు సయెద్ మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో హైదరాబాదు మంచి ముత్యాలు, కళంకారీ, పెయింట్స్, మార్బుల్ బొమ్మలు, సారంగపూర్ ఉడ్ కార్వింగ్ బ్లాక్ మెటల్, అగరబత్తులు, ఏటి కొప్పాక బొమ్మలు, బీట్స్ జెవెల్లరీ కార్పెట్స్ రాజస్థాన్ టెడ్ షీట్స్, బెంగాల్ కాటన్ శారీస్, కాటన్ డ్రెస్ మెటీరియల్స్, మైసూర్ రోజ్ టెరాకోట్, డోర్ కర్టెన్స్, దివాన్ సెట్స్, టాప్స్, కళంకారీ డ్రెస్ మెటీరియల్స్, నైటీస్, బ్యాగులు, పటియాలా సూట్స్, ఒరిస్సా ఆప్లిక్ వర్క్స్, స్టోన్ ఫోటోస్, మధుబాని పెయింటింగ్స్, బాంబూ వర్క్స్, వైట్ మెటల్, మెడిటేష్ ఫోటోస్, ఇంకా ఎన్నెన్నో రకరకాల వస్తువులు ఈ ప్రదర్శనలో చోటుచేసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శనను తిలకించి చేతివృత్తి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

# కూటమికి కాపు అండ వాసిరెడ్డి



**కాకినాడ రూరల్ విశ్వం వాయిస్ న్యూస్:**
రాష్ట్రంలో ఉన్న కాపు సామాజిక వర్గీయులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అత్యధిక శాతం మంది ఓట్లు వేశారని అందువల్లే భారీ విజయం సాధించినట్లు రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు వాసి రెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణులు అన్నారు. జనసేనాని పవన్ కాపు సామాజిక వర్గం ఓట్లు కూటమికి వెళ్లేలా చేయించడంలో చాలా సఫలీకృతులయ్యారని వారు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ మహాకూటమి విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, నల్లా విష్ణులు ప్రసంగించారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో కాపు సామాజిక వర్గీయుల పాత్ర మరువలేనని, ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఇచ్చి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. అలాగే ప్రతిపక్ష వైసీపీ తరుపున ఎన్నికైన పదకొండు మందిలో ఏ ఒక్క కాపు సామాజిక వర్గానికి చెందిన వారిని ఎమ్మెల్యేగా గెలవనీయకుండా అడ్డుకోవడం పట్ల తామంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. తామంతా రాష్ట్రంలో జేఏసీ తరఫున సుమారు 42 నియోజకవర్గాలలో మహాకూటమి అభ్యర్థుల విజయం కోసం తిరిగామని అందులో 40 స్థానాల్లో అభ్యర్థులు విజయం సాధించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కాపు సమస్యలు, అభివృద్ధి, సంక్షేమం, కార్పొరేషన్, రిజర్వేషన్ వంటి అంశాలపై దృష్టి సారించాలని వారు కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ప్రధాని మోడీలతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ సభ్యులందరికీ రాష్ట్ర కాపు జేఏసీ తరుపున వారంతా ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశంలో కాపు జేఏసీ నాయకులు బసవా ప్రభాకర రావు, బివన్ మూర్తి, రొక్కం సూర్య ప్రకాష్, సంజీవ్ కుమార్, నల్లా పవన్, జానపాముల నాగబాబు, రామదేవు సీతయ్య దొర, అడబాల సత్యనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు..

# వైయస్సార్ పార్టీకి రాజీనామా



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్:**
అమలాపురం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ పార్టీ పరాజయం పట్ల నైతిక బాధ్యత వహిస్తూ. అంబేద్కర్ కోనసీ మ జిల్లా వైయస్సార్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అమలాపు రం చెందిన న్యాయవాది కుడుపూడి అశోక్ పార్టీ సభ్యత్వానికి. పదవికి రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు.. పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి. జిల్లా పార్టీ అధ్యక్షులు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కు. రాష్ట్ర పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు ఎం మనోహర్ రెడ్డికి తన రాజీనామా లేఖను పంపినట్లు అశోక్ తెలిపారు.

# రాజానగరం నియోజకవర్గ ప్రజానీకానికి కృతజ్ఞతలు,నీరుకొండ



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:**
ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి గత రికార్డులను తిరగతోడి అత్యధిక మెజార్టీ చేకూర్చిన రాజానగరం నియోజకవర్గా ప్రజానీకానికి భారతీయ జనతాపార్టీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాజానగ రం నియోజకవర్గ భాజపా కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి అన్నారు. శుక్రవారం ఆయన కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరన్న చౌదరికి కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ గణేష్, తెదేపా నాయకులు, భాజపా నాయకులు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నీరుకొండ మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల్లో ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎన్డీఏ విజయానికి అహర్నిశలు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. త్వరలో ఏర్పడి ఎన్డీఏ ప్రభుత్వం గత ప్రభుత్వంల కక్ష సాధింపుల ధోరణి విడనాడి, ప్రజా సంక్షేమానికి రాష్ట్ర అభివృద్ధికి పెద్ద పేట వేసి, అన్ని వర్గాల ప్రజలకు మన్ననలు పొందాలన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని గద్దె దింపడానికి స్వాతంత్రానికి ముందు భారతీయులు ఏకతాటి పైకి వచ్చి బ్రిటిష్ వారిని తరిమికొట్టడానికి ఎలా పోరాటం చేశారో అదేవిధంగా వైసీపీ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో పెక్కిలించారన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో చిన్నమ్మకు మంత్రిపదవి రాగానే కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కటకం చలం, సుంకర శ్రీను, కామిశెట్టి దొరబాబు, బడగల్లపాటి శ్రీనివాస్, దాచేటి శ్రీను, తగరంపూడి గణపతి, పచ్చారి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం జామా మసీద్ సమస్యలపై

## వినతి పత్రం అందిస్తున్న ముస్లిం కమిటీ

**చింతూరు(కూనవరం)విశ్వం వాయిస్ న్యూస్:**
మండలంలోని ముస్లిం మైనార్టీ దేవాలయమైన (జామా మసీదు)లో గురువుకి ఇమామ్ మసీదు మెయింటినెన్స్ కి కొంత డబ్బు కొరత అవడంతో మసీద్ కి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మా జామా మసీదుకు ఆర్థిక సాయం అందించాలని ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ కి వినతి పత్రం అందించిన జామా మసీద్ కమిటీ సభ్యులు, జమాల్ ఖాన్ స్పందిస్తూ మీ గురువుకి మసీద్ మెయింటినెన్స్ కొరకు ఇదివరకే నేను 5000 రూపాయలు ఇస్తానని మీకు తెలియజేయడం జరిగింది, మీరు నాకు మీ గురువుగారి బ్యాంక్ అకౌంట్ నెంబర్ వారి ఆధార్ కార్డ్ వాటి జిరాక్స్ నాకు పంపిస్తే ఈ నెల నుండి మా ట్రస్ట్ ద్వారా ప్రతినెలా రెండో తేదీన మీ గురువుగారు ఎకౌంట్లో డబ్బులు జమ చేయడం జరుగుతుంది అని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరుల కుల పెద్ద సూఫీ, మసీద్ గురువుగారు సద్దాం,భాష, మున్ఫ్, పాల్గొన్నారు.



# టీడీపి చారిత్రక విజయంతో తెలుగు వీరమహిళలు సంబరాలు



**కాకినాడ,విశ్వం వాయిస్ న్యూస్:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో టీడిపి, జనసేన,బిజేపి కూటమి అఖండ ఘన విజయం సాధించడంతో తెలుగు మహిళా నాయకురాలు డా.రాయవరపు సత్యభామ ఆధ్వర్యంలో కాకినాడలోని తెలుగు దేశం మహిళలు, జనసేన వీర మహిళలు ఘన విజయోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి.సత్యభామ మాట్లాడుతూ కాకినాడ ఎమ్మెల్యేగా వనమాడి కొండబాబు, జనసేన పార్టీ అధినేత మరియు పిఠాపురం జనసేన ఎమ్మెల్యేగా కొణిదెల పవన్ కళ్యాణ్,రూరల్ ఎమ్మెల్యే గా పంతం నానాజీ,కాకినాడ పార్లమెంట్ సభ్యులుగా తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ లను అధిక మెజార్టీతో విజయం సాధించడం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణగా నిలిచే తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు సారధ్యంలో మరలా ప్రమాణ స్వీకారం చేయడం శుభసూచకమని ఆమె పేర్కొన్నారు.తెలుగు మహిళలు, వీరమహిళలు విజయోత్సవానికి చిహ్నంగా కేకు కట్ చేసి స్వీట్స్ పంచి వేడుకలు జరుపుకున్నారు.

# మోరాంపూడి ప్లైఓవర్

## శంకుస్థాపన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన టిడిపి నాయకులు



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :**
రాజమహేంద్రవరం మోరంపూడి సెంటర్లో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో రూ 60 కోట్లు వ్యయంతో 1.42 కిలోమీటర్లు నిర్మిస్తున్న ప్లై ఓవర్ బ్రిడ్జి కు 2022 సెప్టెంబర్ నెలలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి వర్చువల్ పద్ధతిలో ఆర్ట్స్ కాలేజి కళాశాల ప్రాంగణం లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మోరంపూడి ప్లైఓవర్ వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిలాఫలకాన్ని టిడిపి నాయకులు ధ్వంసం చేశారు. ఈ ప్లై ఓవర్ నిర్మాణానికి ముఖ్య కారకులు మాజీ ఎంపీ మురళి మోహన్ అని ఆయన హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వైసీపీ నాయకులు తొలగించారనే కారణంతో టిడిపి నాయకులు బొమ్మురు పోలీసులు అక్కడే ఉన్న సరే ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.



# మాలమహానాడు ఎటపాక మండల అధ్యక్షులుగా

## బుయ్యన వంశీ నియామకం

### హర్షం వ్యక్తం చేస్తున్న ఏజెన్సీ ప్రాంత మాలలు



**చింతూరు(ఎటపాక ) విశ్వం వాయిస్ న్యూస్ :**
మాలమహానాడు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండల అధ్యక్షులుగా మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన బుయ్యన వంశీని నియమించినట్టు మాలమహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నవరపు కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుయ్యన వంశీకి నియామక పత్రం అందజేశారు. ఏజన్సీ ప్రాంతంలోని దళితుల సమస్యల పట్ల అవగాహన కలిగి పరిష్కారం కోసం పని చేయాలని వంశీని కోరారు. సంఘం నిర్మాణంలో అంకిత భావంతో , మాల మహానాడు నిర్మాణానికి తోడ్పాటు అందిస్తూ మాలలకు సేవలు అందించాలని వంశీని నియమించినట్లు తెలియజేశారు. దాంతో వంశీ నియామకం పట్ల ఏజెన్సీ ప్రాంతంలోని మాలలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం/జూన్/8/2024

04

www.viswamvoice.com


## కార్యాచరణలో ఎమ్మెల్యే వేగుళ్ళ
# ప్రజా సమస్యలపై స్పందన

**టిడ్కో అపార్ట్మెంట్ల సందర్శన... జంగిల్ క్లియరెన్స్ కు ఆదేశాలు.సౌకర్యాల కల్పనకు పెద్దపేట**




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :**
ఎన్నికల ఫలితాలు వచ్చిన అనంతరం ప్రజలతో క్షణం తీరిక లేకుండా ఉన్న మండపేట నియోజకవర్గ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కార్యాచరణలో దిగారు. తన కార్యాలయానికి తండోప తండాలుగా జనం వస్తున్నప్పటికీ ఆయన ప్రజా సమస్యలపై స్పందించేందుకు తీరిక తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మండపేట గొల్ల పుంత అపార్ట్మెంట్లను ఆకస్మికంగా సందర్శించారు. టీడ్కో ఈ ఈ రిటా,మండపేట మున్సిపల్ కమిషనర్ బి రాము, టీట్కో డి ఇ, మునిసిపల్ డి ఈ శ్రీనివాస్,సిబ్బంది, బిందు మాధవి,ఇతర అధికారులు , ఆర్ ఐ వంక ప్రభాకర్ చౌదరి ఇతర సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తక్షణమే చిట్టడివి లా పెరిగిపోయిన పొదలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ నివాసం ఉంటున్న మూడువేల కుటుంబాలకు అవసరమైన సౌకర్యాలు తక్షణం కల్పించాలని ఆయన ఆదేశించారు. పాములు బెడద తో ప్రజలు ఎన్న ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం సహించేది లేదని పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రాధాన్య క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అపార్ట్మెంట్ లోకు సంబంధించి అన్ని సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా ఎమ్మెల్యేగా గెలుపొందిన వేగుళ్ళకు అపార్ట్మెంట్ వాసులు భారీ స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. వేగుళ్ళ సమస్యలపై స్పందించే తీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శాంతి భద్రతల
# పరిరక్షణకు చర్యలు
## డిఎస్పి రామకృష్ణ



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్:**
ఎన్నికల ఫలితాలు అనంతరం ఎటువంటి అలజడులు లేకుండా మండపేట నియోజవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని రామచంద్రపురం డిఎస్పి రామకృష్ణ పేర్కొన్నారు. మండపేట పట్టణంలో శుక్రవారం అదనపు బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వపువ్వు సెంటర్ వద్ద నిర్వహించిన పోలీస్ కవాతు అనంతరం డిఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక భద్రత దళాలతో గస్తీ ఏర్పాటు చేశామని చెప్పారు. కవ్వింపు చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపేట నియోజవర్గంలో ఇప్పటివరకు ఎలాంటి చిన్న సంఘటన కూడా చోటు చేసుకోకుండా పోలీసులు సమయస్ఫూర్తితో విధులు నిర్వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టౌన్, రూరల్ సి ఐ లు అఖిల్ జమ, శ్రీధర్ కుమార్, ఎస్ ఐ లు హరి కోటి శాస్త్రి, చైతన్య, ఏ ఎస్ ఐ చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తశుద్ధితో ముందడుగు వేస్తాం
## జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో ముందడుగు వేస్తాం" అని అన్నారు. తన విజయంపై స్పందించి, శుభాకాంక్షలు చెప్పిన ప్రతీ ఒక్కరికీ నటుడు, జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. తాము అందుకున్న విజయం తమపై మరింత బాధ్యతను పెంచింది అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ సాధించిన అఖండ విజయాన్ని అభినందిస్తూ చాలా మంది శుభాకాంక్షలు తెలియ జేస్తున్నారు. రైతులు, కార్మికులు, పారిశ్రామిక వేత్తలు, సామాజిక వేత్తలు, విద్యావంతులు, మేధావులు, మహిళలు, యువత, తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి ప్రముఖ కథానాయకులు, నటులు, నిర్మాతలు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, తెలుగు తోపాటు తమిళ్, కన్నడ, హిందీ చిత్ర పరిశ్రమలకు చెందిన శ్రేయోభిలాషులు ఇలా అందరూ ఈ విజయంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో కూటమి సాధించిన విజయాన్ని స్వాగతిస్తూ అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఈ విజయం మా అందరిపై బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో ముందడుగు వేస్తాం" అని అన్నారు.

## ప్రజల నమ్మకానికి తగినట్లుగా
# పాలన సాగిస్తా !
## కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)



**కాకినాడ రూరల్, విశ్వంవాయిస్ న్యూస్:** నియోజకవర్గ ప్రజలు చాలా పెద్ద బాధ్యతలను నాకు అప్పగించారని, వారి నమ్మకానికి తగినట్లుగా అహర్నిశలు కృషి చేస్తానని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. శుక్రవారం కాకినాడ గుడారగుంట నానాజీ ఇంటి వద్ద ఎన్నికల కౌంటింగ్ తర్వాత తొలిసారిగా కార్యకర్తలు నాయకులను ఆయన కలిశారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు అభిమానులు ఆయనకు పూలగుచ్చాలు, శాలువాలు, గజమాలలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలువురు ఆయనతో కేక్ కటింగ్ చేయించి గెలుపు ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు అత్యధిక భారీ మెజారిటీ ఇవ్వడం నాకు చాలా పెద్ద బాధ్యతగా వుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి 151 సీట్లతో ప్రజలు అతి పెద్ద బాధ్యత అప్పగిస్తే, అహంకార పూరితంగా వ్యవహరించారు. స్థానిక ఎన్నికల్లోనే వారి బండారం బయటపడిందని, కొన్నిచోట్ల ఎలక్షన్లు జరగనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేసి రాజకీయం చేసేవారన్నారు. అందుకే ఇప్పుడు 11 సీట్లకే పరిమితమయ్యారని తెలిపారు. ఇప్పుడు నియోజకవర్గంలో చాలా చోట్ల అత్యధిక మెజారిటీలు కనబడుతున్నాయి, వారి మాదిరిగానే నిర్లక్ష్య ధోరణితో ఉంటే అదే పరిస్థితి మనకు వస్తుందన్నారు. కావున ఇంత పెద్ద బాధ్యతను నాతో పాటు ప్రతీ కార్యకర్త, నాయకులు భాగస్వామ్యంమై రూరల్ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఇప్పుడు చెప్తున్నాం వైసిపి నాయకుల్లారా వదిలేసాం..పోండిరా మేము మీలా కాదని చివరిగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జనసేన బిజెపి టిడిపి టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనను అభినందించారు.

## డా.కెఎస్.జవహర్ రెడ్డికి ఈనెల 27 వరకూ
# ఆర్జిత సెలవు మంజూరు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డికి ఈనెల 7వ తేదీ నుండి 27వ తేదీ వరకూ అనగా 21 రోజుల పాటు ఆర్జిత సెలవు(earned leave) మంజూరు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ జిఓఆర్టీ సంఖ్య 1058 ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.డా.కెఎస్.జవహర్ రెడ్డి ఆర్జిత సెలవు మంజూరు చేయాల్సిందిగా గురువారం ప్రభుత్వానికి దరఖాస్తు చేసిన నేపథ్యంలో ఆమేరకు అఖిల భారత లీవ్ రూల్స్ 1955 ప్రకారం ఆర్జిత సెలవు మంజూరు చేస్తూ సిఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. సెలవు అనంతరం డా.జవహర్ రెడ్డి తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా సిఎస్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పభుత్వ ప్రధాన కార్యదర్శిగా
# నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ బాధ్యతలు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.నీరబ్ కుమార్ ప్రసాద్ ను సిఎస్ గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ జిఓఆర్టి సంఖ్య 1034 ద్వారా ఆదేశాలు జారీ చేయగా శుక్రవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో సిఎస్ చాంబరులో తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు మరియు విజయవాడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానాల వేద పండితుల దివ్య ఆశిస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ సిఎస్ గా బాధ్యతలు స్వీకరించారు.బాధ్యతలు స్వీకరించిన పిదప ఆయన మాట్లాడుతూ ముందుగా సిఎస్ గా పనిచేసే అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేయనున్న ఎన్.చంద్రబాబు నాయుడు వారికి కృతజ్ఞతలు తెలిపారు.సహచర కార్యదర్శులు,శాఖాధి పతులు,ఇతర అధికారులు,సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్ళేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేసి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో మరింత సమర్ధవంతంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లోను ముందంజలో నిలిపేందుకు తన సాయశక్తులా కృషి చేస్తానని సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో జిఏడి కార్యదర్శి సురేశ్ కుమార్,స్పెషల్ సిఎస్ లు గోపాల కృష్ణ ద్వివేది,రజత్ భార్గవ,కె.విజయానంద్,పిసిసిఎఫ్ వై.మధుసూదన్ రెడ్డి,ముఖ్య కార్యదర్శులు కె.సునీత,ప్రవీణ్ ప్రకాశ్,ప్రద్యుమ్న,ఐటి కార్యదర్శి కె.శశిధర్,సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్, కార్యదర్శి,గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్,పౌరసరఫరాలశాఖ కమీషనర్ హెచ్.అరుణ్ కుమార్,హెూంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్,దేవాదాయ శాఖ కమీషనర్ ఎస్.సత్య నారాయణ,ఇఎఫ్ఎస్టి స్పెషల్ సెక్రటరి డా.చలపతి రావు,ఇంకా పలువురు ఉన్నతాధికారులు, ఇతర అధికారులు,ఉద్యోగులు,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు,సిఎస్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సిఎస్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉద్యోగ ప్రస్థానం:బిటెక్.మెకానికల్ ఇంజనీరింగ్ చేసి సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ 1988లో పశ్చిమ గోదావరి జిల్లాలో అసిస్టెంట్ కలక్టర్(ట్రైనీ)గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి 1990లో తూర్పు గోదావరి సబ్ కలక్టర్ గా,రంపచోడవరం సబ్ కలక్టర్ గాను,1991లో ఏటూరు నాగారం పిఓ ఐటిడిఏగా,1992లో కృష్ణా జిల్లా పిడి డిఆర్డిఏగాను పనిచేశారు.1993లో కృష్ణా జిల్లా జాయింట్ కలక్టర్ గా,1996లో ఖమ్మం కలక్టర్ గా,1998లో చిత్తూరు కలక్టర్ గా పనిచేశారు.1999లో యువజన సంక్షేమశాఖ డైరెక్టర్ మరియు శాప్ ఎండిగా పనిచేసి 2000 ఏడాదిలో కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్ పై వెళ్ళారు.2005లో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ విసి అండ్ ఎండిగా,2007లో పరిశ్రమల శాఖ కమీషనర్ గా,2009లో మత్స్యశాఖ కమీషనర్ గా,ఎపి ఎస్ హెచ్సి ఎండిగా పనిచేశారు.అదే విధంగా 2012లో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి సంస్థ కమీషనర్ గా,రాష్ట్ర విభజన అనంతరం 2014లో జిఏడి ముఖ్య కార్యదర్శి గాను,2015లో వైఏటిసి ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు.2017లో కార్మిక ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా,2018లో టిఆర్అండ్బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, 2019లో రాష్ట్ర పర్యావరణ,అటవీ,శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారు.అనంతరం 2019 నవంబరు నుండి చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సిసిఎల్ఏ)గా పనిచేసి,2022 ఫిబ్రవరి 23 నుండి రాష్ట్ర పర్యావరణ,అటవీ,శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

# వేగుళ్ళకు అభినందనలు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్:**
మండపేట టిడిపి కార్యలయం వద్ద జనం తీర్థం లా వున్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా వున్న చిరు ఉద్యోగులు నుండి మండలస్థాయి అధికారులు, సిబ్బంది, వివిధ వర్గాలకు చెందిన నాయకులు పోటెత్తారు.శుక్రవారం రథం సెంటర్ లో కనీసం నడిచి వెళ్ళే విలు కూడా లేదు. భారీ సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో తిరునాళ్ళు ను తలపించింది. ఈ నేపథ్యంలో నాలుగవసారి శాసనసభ్యులుగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే ను మండపేట టూవీలర్స్ ఆటో కన్సల్టెంట్ తమ అభినందనలు తెలిపారు. శాసనసభ్యులు కు శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ సభ్యులు ఘంట శ్రీనివాస్, చిర్ల ఆదిరెడ్డి, ఎస్ వెంకటరత్నం, దేగల లక్ష్మణ్, టిప్ప వీరబాబు, బలుసు రామకృష్ణ, వెదురుపర్తి శివ, పలివెల దుర్గాప్రసాద్, ఘంటశబరినాథ్ తదితర సభ్యులు పాల్గొన్నారు.



# బీజేపీకి అంత సీన్ ఉందా?

**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలంగాణలో బీజేపీ క్రమంగా పుంజుకుంటుం దన్నది వాస్తవమే. బీఆర్ఎస్ ఉనికి కోల్పోతుండటంతో బీజేపీ బలపడుతోందనే టాక్ వినిపిస్తోంది. కానీ తెలం గాణ అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిచి అధికారంలోకి వచ్చేంత సీన్ ఉందా అంటే కచ్చితంగా లేదనే చెప్పాలి. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నది విశ్లేషకుల మాట. కానీ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాత్రం వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 88 సీట్లు గెలిచి అధికారంలోకి వస్తామనే ధీమా వ్యక్తం చేశారు. 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క సీటు మాత్రమే గెలిచింది. గోషామహల్ నుంచి రాజాసింగ్ విజయం సాధించారు. 2019 లోక్సభ ఎన్నికల్లో మాత్రం బీజేపీ 4 స్థానాల్లో అనూహ్యంగా విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత బండి సంజయ్ అధ్యక్షుడిగా రావడంతో తెలంగాణలో బీజేపీ దూకుడు అందుకుందన్నది కాదనలేని నిజం. దీంతో 2023 ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభావం ఎక్కువే ఉంటుదనిపించింది. అయితే ఎన్నికలకు ముందు సంజయ్ను తప్పించి కిషన్ రెడ్డికి రాష్ట్ర బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. దీంతో బీజేపీ జోష్ తగ్గిపోయింది. అయినా అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాల్లో నెగ్గింది. లోక్సభ ఎన్నికల్లోనూ 8 స్థానాలను సొంతం చేసుకుంది. దీంతో వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాల్లో గెలుస్తామని కిషన్ రెడ్డి అంటున్నారు. కానీ బీజేపీకి అంత సీన్ లేదన్నది విశ్లేషకుల అంచనా. లోక్సభ ఫలితాలను చూసి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ప్రదర్శన చేస్తామని అనుకోవడం సరికాదు.

# రాజమండ్రిలో ఏమిటి టీడీపి విధ్వంసకర చర్యలు?

## మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిలాఫలకం ధ్వంసం దేనికీ?
## పేపర్ మిల్లు వద్ద ఓ కార్యాలయం విధ్వంసం, సీతంపేటలో ఒకరిపై దాడి..తలకు పెద్ద గాయం
## ఏమిటీ సంస్కృతి, దేనికీ సంకేతాలు? రాజమండ్రి ఎంపీ భరత్ ఆవేదన..





**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:**
రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఇంకా కొలువు తీరలేదు..రాజమండ్రిలో మాత్రం విధ్వంసకర ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమని రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో పలుచోట్ల చోటు చేసుకున్న విధ్వంసకర సంఘటనా స్థలాలను మాజీ ఎంపీ భరత్ స్వయంగా పరిశీలించారు.మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన శిలా ఫలకాన్ని ధ్వంసం చేశారు. అలాగే రాజమండ్రి పేపర్ మిల్లు సమీపంలో ఓ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. సీతంపేటలో ఒక వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. 13 కుట్లు పడి అతని తలకు బలమైన గాయమైంది. సమాచారం తెలుసుకున్న భరత్, నగర వైసీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైసీపీ నేతలు పాలిక శ్రీనివాస్, ఎస్వీ శ్రీనివాస్ తదితరులు ఆయా సంఘటనా ప్రాంతాలకు వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు.పోలీసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రి ప్రశాంతమైన నగరమని, ప్రజలు భయాందోళనలకు గురయ్యేలా ఎవరూ వ్యవహరించ కూడదని అన్నారు.అటువంటి ప్రశాంత వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. నగరంలో ఒకసారి కేన్సిల్ అయిన మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జిని తిరిగి శాంక్షన్ చేయించడానికి జాతీయ రహదారి అధికారులు, కేంద్ర ప్రభుత్వంతో ఏ విధంగా తలపడి సాధించాననే విషయం నగర ప్రజలందరికీ తెలుసన్నారు. ఈ మోరంపూడి జంక్షన్ వద్ద వేలాది ప్రమాదాలు సంభవించి వందలాది మంది ప్రాణాలు పోయాయన్నారు. దానిని దృష్టిలో ఉంచుకుని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ ఫ్లై ఓవర్ బ్రిడ్జి శాంక్షన్ చేయించానని చెప్పారు. శంకుస్థాపనకు కేంద్ర హైవే మంత్రి గడ్కరీ వచ్చారని, అటువంటి శిలాఫలకాన్ని ఎందుకు ధ్వంసం చేశారో అర్ధం కావడం లేదన్నారు. గతంలో ఇటువంటి నీఛ సంస్కృతి రాజమండ్రిలో లేదన్నారు.ఏ ఉద్దేశంతో ఎవరు చేసినా, ఎంతటి వారైనా ఉపేక్షించకూడదని అన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రతినిధులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు తన స్థలాన్ని ఉచితంగా కారా?నాకు ఇచ్చానని చెప్పారు. నా నగరం అభివృద్ధి చెందితే సంతోషమేనని, కానీ ఇటువంటి విధ్వంసకర సంఘటనలతో ప్రజలలో ఆందోళనలకు తావివ్వడం ఎట్టి పరిస్థితుల్లోనూ మంచిది కాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పాలకులు శ్రద్ధ తీసుకోవాలని మాజీ ఎంపీ భరత్ విజ్ఞప్తి చేశారు.

## కాకినాడ ఎస్పీచేతుల మీదగా
# స్పార్క్ ఇన్నోవేటివ్ సమిట్ పోస్టర్ను ఆవిష్కరించారు



**కాకినాడ జిల్లా, ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మొట్టమొదటి శాస్త్రీయ సాంకేతిక ఇన్నోవేటివ్ సమిట్ ను మన కాకినాడ జిల్లాకు చెందిన స్పార్క్ (సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకాడమిక్ అండ్ రీసెర్చ్ క్యాబ్) ఫౌండేషన్ ఏలేశ్వ రం లో జూన్ 16న ఆదివా రం సమీటును నిర్వహించబోతున్నారు,అంతరిక్ష మరియు సాంకేతిక విద్య కోసం కృషి చేస్తున్న ఏకైక సంస్థగా ఇప్పటికే చాలా రికార్డులు సాధించారు. యువతలో సాంకేతికతపై ఆసక్తిని రేకెత్తించడం స్పార్క్ ప్రధాన లక్ష్యం.కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ గారి చేతుల మీదుగా స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్ సాయి సందీప్ స్పార్క్ ఇన్నోవేటివ్ సమిట్ పోస్టర్ను ఆవిష్కరించారు.అలాగే మొదటి ఆహ్వాన పత్రికను కాకినాడ ఎస్పీకి అందించారు.మరియు స్పార్క్ ఇన్నోవేటివ్ సమిట్కు ముఖ్యఅతిథిగా కాకినాడ ఎస్పీ గారు విచ్చేస్తున్నారు,స్పార్క్ ఇన్నోవైట్ డైరెక్టర్ సాయి ప్రదీప్ గారు మాట్లాడుతూ ఈ సమీట్లో రిజిస్ట్రేషన్ ఐ ఎవరైనా పాల్గొవచ్చు అని మీడియాకు తెలిపారు.ఈ సమ్మిట్ లో ముఖ్యమైన వ్యక్తులు తెలుగు ఫిలిం యాక్టర్, సైంటిస్టులు ,బిజినెస్ డెలిగేట్స్,స్పార్క్ అడ్వైజరీ బృందం సమ్మెట్టుకు అతిథులుగా వస్తున్నారు,ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా స్టూడెంట్స్ కమ్యూనిటీకి ఉపయోగపడే ఇంటర్నషిప్ మరియు ఇండస్ట్రియల్ విజిట్స్ మరియు జాబ్ సపోర్ట్ అందజేస్తారు,మరింత సమాచారం కోసం 7013232531 సంప్రదించండి.ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ మన జిల్లాలోనే మొట్టమొదటిసారిగా జరుగుతున్న రూరల్ ఇన్నోవేటివ్ సమీటును ప్రతి ఒక్క యువత రిజిస్టర్ ఐ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు నేను వస్తున్నాను మిమ్మల్ని అందరిని కలవడానికి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్పార్క్ కోఆర్డినేటర్ రవికిరణ్ ,ఆదిత్యపాల్గొన్నారు.

## గాలి దుమారానికి నేలకూలిన ఇల్లు
# నేనున్నానని బరోసా ఇచ్చిన జమాల్ ఖాన్




**చింతూరు(ఏటపాక)విశ్వం వాయిస్ న్యూస్:**
ప్రకృతి కన్నెర్ర చేసినందుకు ఒక పేదరాలి ఇల్లు నెలాకూలింది. యేటపాక మండలం లోని గౌరీదేవి పేట గ్రామానికి చెందిన అమర వరపు కుసుమ అనే వృద్ధురాలు ఇల్లు గురువారం వచ్చిన పెద్ద గాలి దుమారం తో పాటుగా భారీ వర్షం కురిసింది.అసమయం లో కరెంట్ పోవటం తో కొవ్వతి కోసం వృద్ధురాలు ఇంటి నుండి పక్కనే ఉన్న కిరాణా దుకానాకి వెళ్ళింది. అదేసమయంలో గాలి తాకిడికి ఇంటిపై చెట్లు విరిగిపడటంతో ఇల్లు పూర్తిగా నేలమట్టం అయినది. ప్రాణాపాయం నుండి బయటపడింది కానీ నిలువ నీడ లేకుండా పోయింది.విషయం తెలుసుకున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమల్ ఖాన్ శుక్రవారం గౌరీదేవిపేట గ్రామము లో బి.సి కాలనీ లో ఉన్న కూసుమ నివాసాన్ని సందర్శించారు. బాధితురాలికి దర్యం చెప్పి బాధపడ వద్దని చెప్పి తనవంతు సాయంగా తక్షణ సాయం గ తన జే.కే.సి. టి ట్రస్ట్ ద్వారా 5000.ఐదు వేలరూపాయల నగదును ఆమెకు అందజేశారు.ఈ సంద్భంగా జమాల్ల ఖాన్ మాట్లాడుతూ ప్రకృతి ప్రకోపానికి ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట నష్టం వాటిల్లుతుదని మనం దర్యంతో నిలబడి ముందుకు వెళ్ళాలని బాధలను ఓర్చుకొని భగవంతుని సాయం కోరుతూ మంచి పనులు తనకు తోచిన వారికి. సహాయ పడాలని కొరినారు. అనంతరం ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు,ఇనుప పైపులు వంటివి అందజేస్తానని బరోసా ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో జే.కే.సి.టి ట్రస్ట్ సభ్యులు ఎస్.కే. షాజహాన్, అమరవరపు నారాయణ, రాము, నరేడ్ల సత్యనారాయణ, కొవ్వూరు ఇంద్రమ్మ, గొల్లపల్లి కృష్ణవేణి, చిలకల ఈశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీట్‌లో అద్భుత ఫలితాలు సాధించిన
# ఆకాశ్ ఎడ్యుకేషన్

### పతిభ చూపిన రాజమండ్రి బ్రాంచి విద్యార్థులు వెల్లడించిన నిర్వాహకులు



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:**
ఆకాశ్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ లిమిటెడ్ రాజమండ్రి బ్రాంచ్ 2024 నీట్ ఫలితాలలో మరొకసారి అద్భుత ప్రదర్శన కనబరి చింది.తమ బ్రాంచ్ నుండి 10మంది పైగా విద్యార్థులు 720 మార్కులకు గాను 600కి పైగా మార్కులు సాధించి ప్రావీణ్యం సాధించారని నిర్వాహకులు తెలిపారు.ఈ విజయాన్ని గుర్తించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బ్రాంచిలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.వారి వివరాలు మేడిశెట్టి సత్యశ్రీ 696, చాపరాల సంయుక్త 640,నూలు రోషిణి 637,అందె వందన 625,మల్లవీలి అశ్విని సత్యశ్రీ వైష్ణవి 622, మేడపాటి జ్యోతి ప్రియాంక 612, పోతాబత్తుల బాలనాగజ్ఞాన వైష్ణవి 610, బుసల పూర్ణశంకర్ 608, మల్లిడి అలేఖ్య 607, మునిని సదాశ్రీ 600 మార్కులు సాధించారు.కార్యక్రమంలో విద్యార్థులు తమ విజయానికి సంబంధించిన సంతోషాన్ని వ్యక్తపరచడమే కాకుండా తమ తల్లిదండ్రుల కృషిని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. తల్లిదండ్రుల కష్టపడే నైపుణ్యం,ధైర్యం మరియు త్యాగం వల్లేఈ విజయాలు సాధ్యమయ్యాయని విద్యార్థులు తెలిపారు.సందర్భంగా చాలా మంది తల్లిదండ్రులు కూడా భావోద్వేగానికి లోనై తమ పిల్లల విజయాలను చూసి ఆనందబాష్పాలతో తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.విద్యార్థుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి 696 మార్కులు సాధించాడు. ఈ విద్యార్థి తమ లాంగ్ టర్మ్ బ్యాచ్లో చేరి తన తండ్రి ఒక మధ్యతరగతి ఉద్యోగి అయినప్పటికీ వారి కష్టానికి ప్రతిఫలంగా ఈ ఫలితాన్ని సాధించాడు. ఈ విజయంతో ఆకాశ్ విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకోవడానికి కావలసిన సమగ్ర పాఠశాల మరియు మార్గదర్శకత్వాన్ని అందిస్తుందని మరోసారి నిరూపితమైంది.పరీక్షకు సన్నద్ధమవుతున్న ఇతర విద్యార్థులు కూడా మా లాంగ్టర్మ్ బ్యాచ్లో చేరాలని మరియు విజయం వైపు ముందుకు సాగాలని కోరుకుంటున్నామని నిర్వాహకులు తెలిపారు.మా విద్యార్థుల కృషి పట్టుదల తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతాయని తాము గర్వంగా ప్రకటిస్తున్నామని చెప్పారు.

## నాగంపల్లిలో
# ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:**
తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నాగంపల్లి గ్రామంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎం రాజు ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాం జరిగింది. మండలంలోని ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపు పెడుతూ ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కలిగిస్తున్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్లప్ర జలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ఎం రాజు తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎన్ రాజు, ఎం ఎల్ హెచ్ పి సుందరి, ఆశాలు, విజయ కుమారి, ఏఎన్ఎం వైశాలి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్. టి. అర్.విగ్రహానికి పాలాభిషేకం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :**
అమలాపురం రూరల్ మండలం బండారులంక పంచాయితీ వద్ద ఉన్న నిలువెత్తు ఎన్.టి.అర్. విగ్రహానికి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన సందర్భంగా పాదాభిషేకం చేసి పూల దండలు వేసి నివాళులు అర్పించారు శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ,,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి పెనుమాల సునీత ఏడుకొండలు, మాడా మాధవి, ఆశపు చిన్ని, కాశిన బాబీ, బొంతు శ్రీను, బండి సుబ్బారావు, కాశిన ఫనీంద్ర ,కొండా రాజు, చింతపట్ల గంగా సత్యనా రాయణ, బళ్ల వీర్రాజు, బల్ల వెంకటేశ్వరరావు, జీవ రత్నం, ఇంకా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా శ్యామ్ ను సన్మానించారు.

## వివేకానంద సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో
# బంగారు పతకం సాధించిన సుధకి ఘన సన్మానం



**కాకినాడ జిల్లా,ఏలేశ్వరం,విశ్వం వాయిస్ న్యూస్:**
ఇటీవల కాకినాడలో శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పోటీ పరీక్షల్లో ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన గంటా రాంబాబు,సుగుణ దంపతుల కుమారుడు రమేష్ సతీమణి లక్ష్మీ ఘనచక్ర ఉమామహేశ్వరి అనే సుధ బంగారు పతాకం సాధించారు.ఈ సందర్భంగా పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆమెకి ఘన సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి ట్రస్ట్ సభ్యులతో పాటు జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇన్చార్జి వరుపుల తమ్మయ్య బాబు, గ్రామ పెద్దలు తాళ్లూరి గొల్లాజీరావు,పంతం పద్మనాభం,నల్లలశెట్టి వీరబాబు,అడ్డూరి కోటేశ్వర రావు,మల్లెపాక నాగేంద్ర, కుర్ర గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ ఎంపీ
## కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలకు అభినందనలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డిఏ కూటమి తరపు న కాకినాడ పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ గ్రామీణ శాసన సభ్యునిగా పంతం నానాజీ అఖండ ఆధిక్యంతో విజయం సాధించడంతో వారిని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నల్ల శ్రీనివాస్ (బుల్లెట్ వాసు), శంఖవరం మండలం కొంతంగి గ్రామానికి చెందిన జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు, కార్యకర్తలు, జనసేన అభిమానులతో కలిసి గజమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాకినాడలోని వారి నివాసాల్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్, ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ జనసేన పార్టీ ఇంత అఖండ ఆధిక్యం సాధించడానికి ముఖ్య కారణం జన సైనికులేనని, పార్టీ కోసం కష్టంచి పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలకర్ర గంగాధర్, గుడాల సూరిబాబు, మేడసాని రమణ, తోకల కిరణ్, రాయపాటి వీరబాబు, తేటకాయల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



# అక్షయ ఆర్థిక సహాయం

**విశ్వం వాయిస్ రావులపాలెం:**
స్థానిక రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన జి శేఖర్ బాబు ఇతను కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నారు వీళ్ళఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కారణంగా అక్షయ సేవ సంస్థను సహాయం కోరగా సంస్థ నుంచి 10000 రూపాయలు.. సంస్థ సభ్యులు సత్తి ఆంజనేయ రెడ్డి , 1000 రూపాయలు మొత్తం 11000 పొడగట్లపల్లి వెళ్లి అక్షయ సేవా సంస్థ సభ్యులు చేతులు మీదుగా ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగింది.

# ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయం

**తప్పు చేయాలన్న ఉద్దేశం మాకు లేదు... ఉన్నదంతా ఆవేదన బాధ**
**విధ్వంసాలు... దాడులు చేయడం మా సంస్కృతి కాదు.. మాకు రాదు**
**నగరంలో చేపట్టిన అనాలోచిత పనులను సరి చేస్తాం**
**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:
తప్పులు చేయాలి... గత పాలకుల పై దాడులు చేసి విధ్వంసాలు చేయాలన్న ఆలోచనలు తమకు మచ్చుకైనా లేవని రాజమహేం ద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. స్థానిక తిలక్ రోడ్డులోని ఎన్నికల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదు కోట్ల ప్రజానీకం తమకు మద్దతుగా నిలిచారన్నారు. ఒక మంచి నిర్ణయం ఇచ్చారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని, గాడి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెడతామన్నారు. రాష్ట్రానికి రాజధాని నిర్మిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమాన్ని అమలు చేస్తామన్నారు. కేంద్రం నుంచి మన రాష్ట్రానికి ఇంకేమైనా రావాల్సి ఉంటే వాటన్నింటీ తీసుకువస్తామన్నారు. ప్రజలు అవకాశం ఇచ్చారు కదా అని వైకాపా వారిపై దాడులు చేయాల్సిన అవసరం తమకు లేదని, అంత సమయం కూడా తమకు లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల్కెతే అదంతా ఆవేదన, బాధ, అభిమానం... కోపంతోనే చేస్తున్నామని తమ కూటమి నాయకులు చెబుతున్నారని అన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెనను మంజూరు చేయించిన మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ పేరును ఈ ఐదేళ్ళల్లో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడంతో తమ నాయకులు, కార్యకర్తల్లో ఆవేదన బాధ ఇప్పుడు బయటకు వస్తోందన్నారు. తమ పెద్ద పండుగ మహానాడు వేమగిరిలో జరుగుతున్న నేపథ్యంలో తమ ఫ్లెక్సీలు, తోరణాల మధ్య వారి ఫ్లెక్సీలు తోరణాలు కట్టడం ఏంటని ప్రశ్నించారు. సంస్కృతి గురించి మాట్లాడుతున్న ఆ మాజీ ప్రజాప్రతినిధి నాడు సంస్కృతికి పక్కన పెట్టేసారా అని ప్రశ్నించారు. అమరావతి పాదయాత్ర జరుగుతుంటే మహిళలు, రైతులపై దాడి చేయడం సంస్కృతా..? అన్యాయంగా అరెస్టు కాబడి జైల్లో ఉన్న తన భర్త నారా చంద్రబాబు నాయుడు క్షేమంగా విడుదల కావాలని భువనేశ్వరి 22వ డివిజన్‌లోని వినాయకుడి ఆలయంలో పూజలు చేసుకునేందుకు వెళుతుంటే ఉద్దేశ పూర్వకంగా అధికారంలో ఉన్నామన్న అహంకారంతో మొదటి పూజ మేమే చేసుకోవాలని భరత్ రామ్ ప్రవర్తించిన తీరు సంస్కృతా అని శ్రీనివాస్ ప్రశ్నించారు. రాజమండ్రి సిటీ ఇన్‌ఛార్జ్ అత్తి సత్యనారాయణ దాడులు చేయడానికి, ప్రతీ కారాలు తీర్చుకోవడానికి తమకు సమయం లేదని, సమన్వయం పాటించాలని కూటమి నాయకులు, కార్యకర్తలను కోరామన్నారు. ఇదే ఆలోచనతో మన అధినాయకులు ఉన్నారన్నారు. ఐదేళ్లల్లో అనేక సంఘటనలు జరిగాయన్నారు. ఉదయం మోరంపూడి జంక్షన్‌లో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో తాను వద్దని వారించానన్నారు. ఈ ఐదేళ్లల్లో అల్లకల్లోలంగా మార్చిన నగరాన్ని ప్రశాత నగరంగా తీర్చి దిద్దుతామన్నారు. అనాలోచితంగా చేపట్టిన పనులన్నింటిని సరి చేస్తామని సత్యనారాయణ అన్నారు. మీడియా సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, రాజమండ్రి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షులు మజ్జి రాంబాబు, నగర కమిటీ కార్యదర్శి కిలపర్తి శ్రీనివాస్, నగర బీసీ సెల్ అధ్యక్షులు బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:**
కన్స్యూమర్ వాయిస్ మరియు జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం స్థానిక క్వారీ మార్కెట్ రైతు బజార్ లో కన్స్యూమర్ వాయిస్ అధ్యక్షులు,జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వి.రుక్కయ్య, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడి ఎం.వినయ్ సునీల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రుక్కయ్య మాట్లాడుతూ ఆహార భద్రత విషయంలో లోపాలు ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా లోని అనేక రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ప్రతీ ఆహార సంబంధిత వ్యాపారస్తుడు ఫుడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడి వినయ్ సునీల్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బలవర్ధకమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తద్వారా అందరూ ఆరోగ్యవంతులు అవడంతో పాటు దేశం మరింత ముందుకు సాగుతుందన్నారు. గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ ఎవరైనా ఆహార నాణ్యతా ప్రమాణాల్లో లోపాలు గుర్తించి మా దృష్టికి తీసుకువస్తే, వెంటనే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి దోహదపడతామన్నారు. అనంతరం రైతుబజార్ లోని షాపులను తనిఖీ చేసి రైతులకు మరియు వ్యాపారస్తులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యులు ధర్నాలకోట వెంకటేశ్వరరావు,కె.వి.రమణ, అమరవాది రామకృష్ణ, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, అధిక సంఖ్యలో రైతులు, వ్యాపారులు,వినియోగదారులు పాల్గొన్నారు.


## ఉమ్మడి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకి శుభాకాంక్షలు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్**
శుక్రవారం.. పి. గన్నవరం నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ భారీ అఖండ విజయం సాధించిన శుభ సందర్భంగా వారి పార్టీ ఆఫీస్ లో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి శ్రీ మెట్ల రమణబాబు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామి నాయుడు వారికి దుశాలువాకప్పి శుభాకాంక్షలు తెలియజేసినారు...ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నల్లా స్వామి, అమలాపురం మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు దున్నాల దుర్గ, జంగా అబ్బయి వెంకన్న, రాష్ట్ర నాయకులు దేశంశెట్టి లక్ష్మినారాయణ, కర్రి రామస్వామి, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మట్టా మహాలక్ష్మి ప్రభాకరరావు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, శ్రీను గంధం తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఎవర్ని ఉపేక్షించేదిలేదు శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ ప్రాధాన్యత

**ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు**
**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్**



**అమలాపురం, టౌన్ విశ్వం వాయిస్ న్యూస్**
జిల్లాలో సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్క పోలీస్ అధికారికి సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ అభినందనలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ కార్యాలయం తరఫున శుక్రవారం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు 2024 ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి నాటి నుండి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్య వరకు జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనను గురుకాకుండా ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరుస్తూ వారిలో అవగాహన పెంపొందిస్తూ ప్రశాంత వాతావరణ ఎన్నికలు నిర్వహించబడేలా కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులకు, ఇతర శాఖల అధికారులకు, పోలీస్ సిబ్బందికి కేంద్ర సాయుధ బలగాలకు జిల్లా ఎస్పీ శ్రీధర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియతో పాటు కౌంటింగ్ ప్రక్రియ పూర్తవడానికి నిర్విరామంగా కృషిచేసి ప్రశాంత వాతావరణ ఎలాంటి హింసాత్మక చర్యలకు, గొడవలకు, అల్లర్లకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ఇతర శాఖ అధికారులను సమన్యాయపరచుకుంటూ, అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తూ విజయవంతంగా ఎన్నికల ఫలితాలు విడుదల అయ్యేంతవరకు అహర్నిశల కృషి చేసిన హెూంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నట్లు ఆయిన తెలిపారు. ప్రతి ఒక్కరూ విధులు పట్ల నిబద్ధతతో వ్యవహరించడం, సమయస్ఫూర్తిగా వారికి కేటాయించిన విధులు శక్తి వంచన లేకుండా నిర్వహించడం వల్లే ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించగలమని ఆయన అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలలో కొనసాగుతున్న పోలీస్ నిఘా ముందు జాగ్రత్తలో భాగంగా మండపేట టౌన్ సిఐఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారని అన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఎవరిని ఉపేక్షించేది లేదని, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసు ప్రాధాన్యతని ఆయన అన్నారు. చట్ట పరిధిలో అందరూ సమానమే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని కవ్వింపు చర్యలకు ఎవరు పాల్పడిన చట్ట ప్రకారం కఠిన చర్య తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతాలలో తమ మాటల ద్వారా చేష్ట ద్వారా అనవసరమైన అలజడి సృష్టించినట్లయితే అటువంటి వారిపై చట్టపరకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని శాంతి భద్రతల పరిరక్షణలో అందరూ సహకరించవలసిందిగా జిల్లా ఎస్పీ శ్రీధర్ కోరారు.

## అంతలో ఎంత మార్పు... ఆధికార ఎమ్మెల్యేనా మజాకా

**టిడ్కో లో తుప్పలు తొలగింపు.డ్రైన్లు శుభ్రం**
**ఆగమేఘాలపై కదిలిన మునిసిపల్ యంత్రంగం**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్:**
అధికారం ఉంటే కిక్కే వేరప్పు...అన్న చందాన వుంది పరిస్థితి. కాలం లో ఎంతో మార్పు తెచ్చే మహిమ కేవలం కాలానికి మాత్రమే వుంది. సరిగ్గా ఎన్నికలు ఓ 15 రోజులు ఉన్నాయన్న సమయం లో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేట గొల్లపుంత టిక్కో అపార్ట్మెంట్లు వద్ద సమస్యల పై మీడియా సమావేశం నిర్వహించారు.మీడియా ను వెంట బెట్టుకుని అక్కడి అద్వాన్న పరిస్థితి చూపించారు. చిట్టి అడవి లా పొదలు పెరిగి అక్కడి ప్రజలు పడుతున్న అవస్థలు వివరించారు.తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కోడ్ అమల్లో వున్న పరిస్థితి లో ఎన్నికల సంఘం కు కూడా విజ్ఞప్తి చేశారు.జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దృష్టి కి కూడా తీసుకువెళ్ళారు. కనీసం ఏ అధికారి దీనిపై స్పందించిన పాపానికి పోలేదు. అసలు పట్టించుకునే లేదు...ఈ నేపథ్యంలో ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వచ్చాయి.అప్పటి ఎమ్మెల్యే వేగుళ్ల తిరిగి ఇప్పటి ఎమ్మెల్యే అయ్యారు. ప్రజా సమస్యల కు ఎప్పుడు ప్రాధాన్యత ఇచ్చే ఆయన శుక్రవారం టిడ్కో వద్ద కు వచ్చారు. సేమ్ సీన్ అడవి అలాగే వుంది. ఇప్పుడు అధికారులు ఆయన వెంట వున్నారు.ఆయన తక్షణం జంగిల్ క్లియర్ చేయాలని ఆదేశించారు. గంటల వ్యవధి లో అధికారులు స్పందించారు. వెనువెంటనే పారిశుధ్య కార్మికులు రంగం లో దిగారు. కమిషనర్ బి రాము, శానిటరీ ఇన్స్పెక్టర్ లావణ్య లు అక్కడే ఉండి ఆగమేఘాలపై పొదలు తొలగింపు చేపట్టారు. అపార్ట్మెంట్ ఆవరణ అంతా శుభ్రంగా మారిపోయింది.డ్రెయిన్లు శుభ్రం చేసేశారు. మరో రెండు రోజుల్లో మొత్తం పని పూర్తి అవుతుంది. అప్పటి కి ఇప్పటికీ తేడా ఒక్కటే. అపుడు అధికారం లేదు.ఇపుడు అధికారం వుంది. మొత్తం మీద తమ సమస్యలు పరిష్కారం అవుతుందనీ కాలని వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణా ముగింపు



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్:**
మండపేట శాఖ గ్రంధాలయం లో శుక్రవారం వేసవి శిక్షణా తరగతులు ముగిశాయి.మండపేట శాఖా గ్రంధాలయం లో మే 15 నుండి శుక్రవారం వరకు 21 రోజు వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) నిర్వహించారు. ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శాఖా గ్రంథాలయం అధికారి ఎస్. పూర్ణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి రోజు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చేత పుస్తకాల కథలు చెప్పించడం, కథలు చదివించడం, పద్యాలు, రాయడం పై శిక్షణ ఇచ్చారు .క్యారమ్ బోర్డు, చెస్, స్నేక్, ల్యూడో , ఆటలో శిక్షణ ఇచ్చారు . డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, పేపరు క్రాఫ్ట్ శిక్షణ నేర్పించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథులు విశ్రాంతి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. విశ్రాంతి ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం లో ఏమి నేర్పించారో విద్యార్థిని విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంకు వచ్చి పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం సంపాదించుకోవచ్చున్నారు. మంచి ప్రవర్తన అలవరుచుకోవచ్చు అని తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం లో విద్యార్థిని విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపరు క్రాఫ్ట్ నేర్పించినందుకు అభినందించారు.

## ఎన్డీయే హాయంలో ప్రారంభమైంది మళ్లీ ఎన్డీయే కూటమిలోనే ప్రారంభిస్తాం

**3 నెలల్లో మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెన ప్రారంభిస్తాంఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**
**అధికారులతో మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులపై సమీక్ష**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:**
మోరంపూడి ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణం నాడు ఎన్డీయే కూటమి హయాంలో ప్రారంభించగా మరో రెండు మూడు నెలల్లో ఎన్డీయే కూటమి హయాంలో ప్రారంభించుకోబోతున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. దాదాపుగా పూర్తి కావచ్చిన మోరంపూడి ఫ్లై ఓవర్‌ను శుక్రవారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకూ ఎన్డీయే అధికారంలో ఉందని, 2019లో ప్రభుత్వం మారిందన్నారు. అయితే అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ కృషి కారణంగానే మోరంపూడి ఫ్లై ఓవర్ మంజూరయ్యిందన్నారు. దాని నిర్మాణానికి శంకుస్థాపన కూడా ఆయన హయాంలోనే జరిగిందన్నారు. అటు తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ హయాంలో వంతెన నిర్మాణానికి మళ్లీ శంకుస్థాపన చేయగా ఆ కార్యక్రమానికి హాజరైన నిత్తిన్ గడ్కారీ కొత్త పని కాదు అనే ఉద్దేశంతోనే పూజలు చేశారని ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. అయితే నాడు గాల్లో నెగ్గిన స్థానిక మాజీ ఎంపీ (అతని పేరు ఉచ్చరించేందుకు కూడా తాను సాహసించడం లేదన్నారు) మోరంపూడి ఫ్లై ఓవర్‌ను తానే మంజూరు చేయించినట్టు తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు. కేవలం అతని తప్పిదం వల్లే వంతెన నిర్మాణం చాలా ఆలస్యమైందన్నారు. ప్రస్తుతం ఇంజనీర్లు, అధికారులను అడగ్గా వాతావరణం అనుకూలిస్తే రెండు మూడు నెలల్లో వంతెన ప్రారంభించవచ్చని అంటున్నారని తెలిపారు.

## హెల్త్ వాయిస్

### వేసవిలో పచ్చి మామిడి తింటే

# ఆరోగ్య ప్రయోజనాలెన్నో!



వేసవిలో పచ్చి మామిడి విరివిగా దొరుకుతుంది. వీటితో సంవత్సరానికి సరిపడా ఆవకాయని పెట్టుకోవచ్చు. లేదా జ్యూస్‌ల్లో ఉపయోగించడమో, ఇతర స్పెషల్ డిషెస్ తయారుచేయడమో చేస్తుంటారు. అలాగే పచ్చిమామిడి ముక్కలపై ఉప్పు, కారం చల్లుకుని యమ్మీగానూ తింటారు. ప్రత్యేకించి వేసవిలో లభించే ఈ పచ్చి మామిడిని తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మరి ఈ మామిడి వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందామా..! పచ్చి మామిడిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది హిమోఫిలియా, రక్తహీనత వంటి ప్రమాదాలను తగ్గించడంలో కీలకంగా వ్యవహరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. రక్తం గడ్డ కట్టడాన్ని నిరోధిస్తుంది.

పచ్చి మామిడిలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉండటం వల్ల కంటిచూపు మెరుగుపడేలా సహాయపడుతుంది. వేసవిలో పచ్చి మామిడిని తినడం వల్ల డీహైడ్రేషన్‌కు గురికాకుడా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. పచ్చిమామిడి అజీర్తి సమస్యల్ని తగ్గిస్తుంది. పచ్చిమామిడిలో విటమిన్ ఇ, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచేందుకు ఎంతగానో దోహదపడతాయి.

### మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉదయాన్నే

# డ్రైఫ్రూట్స్ తినకూడదు



డ్రైఫ్రూట్స్ రుచిగా ఉండడమేకాదు%ొ% త్వరగా శక్తినిస్తాయి. అందుకే చాలామంది తమ ఆరోగ్యం కోసం డ్రైఫ్రూట్స్ తీసుకుంటారు. అయితే ఐదు రకాల డ్రైఫ్రూట్స్ మాత్రం మధుమేహ వ్యాధిగ్రస్తులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఉదయం డ్రైఫ్రూట్స్ తినకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ఎండుద్రాక్ష

ఎండుద్రాక్షలో సహజంగానే షుగర్స్ ఉంటాయి. వీటిని బ్రేక్‌ఫాస్ట్ ముందు ఖాళీ కడుపుతో వీటిని తిన్నట్లయితే రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదముంది. అందుకే ఉదయాన్నే వీటిని తీసుకోకుండా ఉంటేనే మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఒకవేళ వీటిని తినాలనుకుంటే.. రోజులో ఏదో ఒక టైమ్‌లో తీసుకోవచ్చు. వీటిని నేరుగా కాకుండా.. పెరుగుతో కలిపి తీసుకుంటే మంచిది.

అత్తిపండ్లు

అత్తిపండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉన్న ఈ అత్తిపండ్లలో నేచురల్ షుగర్స్ ఎక్కువగా ఉంటాయి. దీంతో అవి తీపిగా ఉంటాయి. వీటిని ఖాళీ కడుపుతో తింటే అసౌకర్యంగా ఉంటుంది. ఉబ్బరంగా అనిపిస్తుంది. వీటిని ఉదయంపూట తీసుకోకుండా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది.

కర్జూరం

కర్జూరంలో చక్కెర ఎక్కువగా ఉండడం వల్ల రుచిగానూ ఉంటాయి. వీటిని బ్రేక్‌ఫాస్ట్ కంటే ముందే తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. వీటిని తీసుకుంటే త్వరగా శక్తినిస్తాయి. కానీ ఊహించని విధంగా షుగర్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉదయాన్నే కర్జూరం తీసుకోకుండా ఉంటేనే మంచిది.

ఆప్రికాట్స్

ఎండిన ఆప్రికాట్స్‌లో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అదేవిధంగా వీటిల్లోనూ నేచురల్ షుగర్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని ఉదయాన్నే కాకుండా.. ఈవినింగ్ స్నాక్స్‌లా తీసుకోవచ్చు. వీటిని చిరుధాన్యాలతో కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది.

ప్రూనె

ఈ పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిల్లో ఉండే నేచురల్ షుగర్స్ వల్ల ఇవి తియ్యగానే ఉంటాయి. వీటిని తింటే.. షుగర్ స్థాయిలు పెరుగుతాయి. ప్రూనె పండ్లను కూడా మధుమేహవ్యాధిగ్రస్తులు తీసుకోకుండా ఉంటే ఆరోగ్యానికి మంచిది.



## హార్మోన్ల అసమతుల్యతకు షుగర్‌తో చెక్

మహిళల ఆరోగ్యంపై చక్కెర తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోజూ స్వీట్స్ ఎక్కువగా తిన్నా.. కాఫీ, టీలు ఎక్కువసార్లు తాగినా..అవి హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తాయని వైద్యులు చెబుతున్నారు. మోతాదుకు మించి షుగర్‌ని తీసుకోవడం వల్ల మెదడు పనితీరులో మార్పులు సంభవిస్తాయి. దీంతో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉండదు. అధిక ఒత్తిడికి, ఆందోళనలకు గురవుతారు. వెంటవెంటనే వారి మూడ్ మారిపోతుంటుంది. మరి హార్మోన్ల సమతుల్యతకు ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందామా..! షుగర్‌ని ఎక్కువగా తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి.. హార్మోన్ల అసమతుల్యతకు దారితీస్తుంది. పిరియడ్స్‌పై కూడా ఈ ప్రభావం పడుతుంది. హార్మోన్ల అసమతుల్యత వల్ల రుతుక్రమం సరిగ్గా ఉండదు. ఒక్కోసారి పిరియడ్స్ ఆలస్యమవుతాయి. పిరియడ్స్ క్రమం తప్పడం వల్ల.. అధిక బరువు పెరుగుతారు. పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. షుగర్‌కి బదులుగా బెల్లం, డేట్స్, కోకోనట్ షుగర్‌ని వాడితే మహిళల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు. పీరియడ్స్ సమయంలో మహిళలు చిరుకుగా ఉంటారు. ఆ సమయంలో ఆరుబయట కాసేపు నడిస్తే.. చిరాకు, కోపాలకు దూరంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి మంచిది. షుగర్ తక్కువగా ఉన్న పదార్థాలని తీసుకోవాలి. ఒకవేళ మీరు స్వీట్ తినాలనుకుంటే.. అప్పుడప్పుడూ బ్రెడ్‌ని తినొచ్చు.

# గర్భాశయ క్యాన్సర్ ఎందుకొస్తుంది? లక్షణాలేంటి?

ప్రముఖ బాలీవుడ్ నటి పూనమ్ పాండే గర్భాశయ క్యాన్సర్‌తో మృతి చెందిందనే వార్త ఇటీవల హల్‌చల్ అయ్యింది. ఆ తర్వాత తాను బతికే ఉన్నానని.. కేవలం సర్వైకల్ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకే అలా వైరల్ చేసినట్టు పూనమ్ పాండే సోషల్‌మీడియా పోస్టు ద్వారా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ సెలబ్రిటిలే కాకుండా.. ఇటీవలి కాలంలో ఎక్కువమంది మహిళలు సర్వైకల్ క్యాన్సర్‌కి గురవుతున్నారు. ఈ క్యాన్సర్‌ని గుర్తించి వెంటనే చికిత్స తీసుకుంటే ప్రాణహాని తప్పుతుంది. లేకపోతే చాలా చిన్న వయసులోనే ఈ క్యాన్సర్ వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరి అసలు సర్వైకల్ క్యాన్సర్ ఎందుకొస్తుంది? దాని లక్షణాలేంటో తెలుసుకుందామా..! గర్భాశయానికి కింది భాగంగా ఉండే సన్నటి ప్రదేశాన్ని సర్విక్స్ అంటారు. ఇది గర్భాశయాన్ని యోనితో కలిపి ఉంచుతుంది. ఆ ప్రాంతంలో వచ్చే క్యాన్సర్‌ని సర్వైకల్ క్యాన్సర్ అంటారు. ఈ క్యాన్సర్ ఎక్కువగా హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) వల్ల వస్తుంది. హెచ్‌పివి అనేది చాలా సాధారణ వైరస్. ఇది దాదాపు ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమయంలో సోకుతుంది. అయితే ఈ హెచ్‌పివి వైరస్‌లోనే విభిన్న జాతులు ఉన్నాయి. ఇప్పటివరకు దాదాపు ప్రపంచవ్యాప్తంగా హెచ్‌పివి 16, హెచ్‌పివి 18 కారణంగానే 70 శాతం గర్భాశయ క్యాన్సర్‌లు వచ్చినట్టు తెలుస్తోంది. వాచ్‌పివి పరీక్షల ద్వారా ఈ సర్వైకల్ క్యాన్సర్‌ని గుర్తించవచ్చు. అయితే గర్భాశయ క్యాన్సర్‌ని మొదటి దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రమాదమేమీ ఉండదని వైద్యులు చెబుతున్నారు.


లక్షణాలు : పీరియడ్స్ సమయంలో విపరీతంగా రక్తస్రావం అవుతుంది. నిరంతరం పొత్తి కడుపులో నొప్పి రావడం, పీరియడ్స్ మధ్యలో తేలికపాటి రక్తస్రావం కావడం, లేదా బ్లడ్ డ్రాప్స్ కనిపించడం కూడా గర్భాశయ క్యాన్సర్ లక్షణాలుగా వైద్యులు చెబుతున్నారు. శృంగారంలో పాల్గొన్న తర్వాత బ్లీడింగ్ కావడం, సాధారణం కంటే ఎక్కువ రోజులు బ్లీడింగ్ కావడం, నీళ్లలాగా యోని నుండి స్రావాలు రావడం, ఆ స్రావాలు కూడా దుర్వాసన వస్తే అవి కచ్చితంగా గర్భాశయ లక్షణాలేనని వైద్యులు అంటున్నారు.



## బిజినెస్ వాయిస్

# బీమా ప్రీమియం వసూళ్లకు మందగమనం: మూడీస్

**న్యూఢిల్లీ :** దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న మాంద్యం దెబ్బకు బీమా ప్రీమియం వసూళ్లు కూడా పడిపోతున్నాయని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ విశ్లేషించింది. వచ్చే రెండు, మూడేండ్లు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని మంగళవారం ఒక రిపోర్టులో అంచనా వేసింది. 2019 మార్చితో ముగిసిన ఏడాదిలో మొత్తం బీమా ప్రీమియం వసూళ్లలోనూ తగ్గుదల చోటు చేసుకున్నట్టు పేర్కొంది. 2019-20లో భారత వ ృద్ధి రేటు 5 శాతానికి దిగువకు పడిపోనుందని కేంద్ర గణంకాల శాఖనే స్వయంగా అంచనా వేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) 2019 భారత జిడిపి అంచనాలను 4.8 శాతానికి కోత పెట్టిన నేపథ్యంలో మూడీస్ రిపోర్టు వెలుపడటం విశేషం. ఈ రిపోర్టు ప్రకారం.. వచ్చే రెండు, మూడేళ్లలో బీమా వసూళ్లలో పెరుగుదల మందగించవచ్చు. 2018-19లో మొత్తం బీమా ప్రీమియం వసూళ్లు 11.3 శాతం పెరిగాయి. ఇంతక్రితం ఏడాది ఈ పెరుగుదల 11.5 శాతంగా ఉంది. మొత్తం పరిశ్రమలో నాలుగో వంతు కలిగిన సాధారణ బీమా వ ృద్ధి క్రితం ఆర్థిక సంవత్సరంలో 12.5 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం 2017-18లో ఇది 17.6 శాతం వ ృద్ధిని సాధించిందని మూడీస్ గుర్తు చేసింది. దీర్ఘకాలంలో బీమా వినియోగం వ ృద్ధి సానుకూలంగా ఉంటుందని ఈ ఏజెన్సీ అంచనా వేసింది. దేశంలో మధ్య తరగతి సంఖ్య పెరుగుతోంది. దీంతో బీమా రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. 2018లో దేశంలో కేవలం బీమా కలిగిన వారి సంఖ్య 3.7 శాతంగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే ఇది చాలా తక్కువ. అదే బ్రిటన్‌లో 10.6 శాతం, అమెరికాలో 7.1 శాతంగా ఉంది. సెప్టెంబర్ 2018లో ఆవిష్కరించిన ఆయుష్మాన్ భారత్ లేదా నేషనల్ హెల్త్ ప్రొటెక్షన్ మిషన్ వల్ల వైద్య బీమా వినియోగంలో పెరుగుదల చోటు చేసుకోవచ్చని అంచనా. ఈ పథకంలో రూ.5లక్షల ఆదాయం కలిగిన 10 కోట్ల కుటుంబాలకు వర్తింపజేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.




## భారత మార్కెట్లోకి గెలాక్సీ నోట్ 10లైట్

**ముంబయి:** ప్రముఖ మొబైల్స్ తయారీ సంస్థ శాంసంగ్ "గెలాక్సీ నోట్ 10లైట్" ఫోన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. గతేడాది విడుదల చేసిన గెలాక్సీ నోట్ 10 కొనసాగింపుగా పలు మార్పులతో సంస్థ ఈ కొత్త ఫోన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ ఫోన్లకు సంబంధించి అడ్వాన్సు బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 2 నుంచి అన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్లలో అమ్మకాలు ప్రారంభమవుతాయని కంపెనీ వెల్లడించింది. ఈ మొబైల్ 6జీబీ, 8జీబీ ర్యామ్‌లతో రెండు వేరియంట్లలో అందుబాటులోకి రానున్నట్లు ప్రకటించింది. దీనిని 2.7 గిగాహెట్జ్ ఎక్సినోస్ 9810 ఆక్టాకోర్ ఎస్‌ఓసీ ప్రాసెసర్‌తో 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ఇన్ఫినిటీ సూపర్ అమోల్డ్ డిస్‌ప్లేతో మార్కెట్లోకి తెచ్చినట్టుగా సంస్థ తెలిపింది.




## ఏజీఆర్ చెల్లింపులకు గడువిప్పించండి!



**న్యూఢిల్లీ :** ఆదాయంపై బకాయిలు రూ.1.47 లక్షల కోట్లు చెల్లించేందుకు గాను తమకు మరికొంత సమయం ఇప్పించాల్సిందిగా భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, టాటా సర్వీ సెస్‌తో పాటు పలు టెలికాం కంపెనీలు సుప్రీంకోర్టులో తాజాగా పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌ను గతంలో ఏ ధర్మాసనం విచారించిందో అదే మళ్లీ దీన్ని స్వీకరిస్తుందని సీజేఐ జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే తెలిపారు. వచ్చే వారం దీన్ని విచారణ జరగనుంది. తమ పిటిషన్‌ను ఛాంబర్‌లో కాకుండా బహిరంగ విచారణ జరపాలని టెలికాం కంపెనీలు అభ్యర్థించాయి. దీనిపై నిర్ణయాన్ని కూడా గతంలో టెలికాం కంపెనీల పిటిషన్ విచారించిన ధర్మాసనమే తీసుకుంటుందని సీజేఐ వెల్లడించారు.

# కిరాణా వ్యాపారంలోకి రిలయన్స్!

దేశంలో రిటైల్ వ్యాపారాన్ని వేగంగా విస్తరించే యోచనలో ఉన్న దేశీయ కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇందుకుగాను వేగంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే చమురు రంగం, టెలికాం రంగాలలో అడుగుపెట్టిన ఈ సంస్థ ఆయా రంగాలలో పోటీ సంస్థలను చావుదెబ్బ కొట్టిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో తాజాగా రిలయన్స్ సంస్థ రిటైల్ రంగంలోనూ విధ్వంసకరంగా విస్తరించేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకు సాగుతున్నట్టు వివిధ వార్తా సంస్థల కథనాల ద్వారా తెలుస్తోంది. తాజా ప్రణాళికలో భాగంగా రిలయన్స్ రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా కిరాణా దుకాణాలను తెరువనుంది. దాదాపు 500 చదరపు అడుగుల నుంచి 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో వీటిని సంస్థ ఏర్పాటు చేయనున్నట్టుగా తెలుస్తోంది. 'రిలయన్స్ స్మార్ట్‌పాయింట్' పేరిట సంస్థ వీటిని ఏర్పాటు చేయన్నుట్టుగా సమాచారం. తొలత వీటిని రిలయన్స్ ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాలలో ఏర్పాటు చేయనున్నట్టుగా సంబంధిత కార్యక్రమాలను నిర్వహి స్తున్న అధికారులను ఉటంకిస్తూ "ఎకనామిక్ టైమ్స్" పత్రిక ఒక కథనాన్ని వెల్లడించింది. రానున్న కాలంలో వీటిని మండలాలు, ప్రధాన గ్రామాల స్థాయికి విస్తరించే అవకాశాలు ఉన్నట్టుగా తెలుస్తోంది. గతంలో నిర్ణయించిన మాదిరిగా కొన్ని ప్రాంతాలలో కిరాణా దుకాణాల వారితో జట్టుకట్టి స్మార్ట్‌స్టోర్స్‌ను ఏర్పాటు చేయడం, మెరుగ్గా లాభసాటిగా ఉంటూ ఎక్కువ వ్యాపార కార్యకలాపాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలలో స్వయంగా కిరాణా దుకాణాలను ఏర్పాటు చేయాలన్నది రిలయన్స్ విస్తరణ వ్యూహంగా తెలుస్తోంది.

**బహుముఖ వ్యూహంతో ఏర్పాటు..**

రిలయన్స్ సంస్థ 'రిలయన్స్ స్మార్ట్‌పాయింట్' పేరిట దేశ వ్యాప్తంగా కిరాణా దుకాణాలను తెరువాలన్న ఆలోచన వెనుక పలు వ్యాపార వ్యూహాలు దాగి ఉన్నట్టుగా విశ్లే షకులు చెబుతున్నారు. ఈ కిరాణా దుకాణాలలో ప్రజలు సూపర్ మార్కెట్ల మాదిరిగానే వెళ్లి తమకు అవసరమైన సరుకులను కొనుగోలు చేసుకొనే వెసులుబాటు కల్పించనున్నారు. దీనికి తోడు రిలయన్స్ రిటైల్ యాప్ ద్వారా బుక్ చేసుకొనే పచారీ సరుకులను కూడా ఇక్కడి నుంచి డెలివరీ తీసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. అంతేకాక అమెజాన్ వంటి అంతర్జాతీయ రిటైల్ దిగ్గజ సంస్థలు చేరుకోలేని మారుమూల ప్రాంతాలకు కూడా తన విస్తృతిని పెంచుకోవాలన్నది రిలయన్స్ వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో తన రిటైల్ వ్యాపారాన్ని దేశ వ్యాప్తంగా ఏకకాలంలో అతిపెద్ద నెట్‌వర్క్ ద్వారా భారీగా విస్తరించేందుకు వీలు పడుతుందన్నది సంస్థ వ్యూహంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.

**చిన్న వ్యాపారులకు చిక్కులే...**

భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా నిలుస్తూ వస్తున్న కిరాణా దుకాణాల, చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి భవిత రిలయన్స్ 'రిలయన్స్ స్మార్ట్‌పాయింట్' నిర్ణయంతో ప్రమాదంలో పడే అవకాశం ఉందని విశ్లేషకులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. రిలయన్స్ మారుమూల ప్రాంతాలలో కూడా తన స్టోర్స్‌ను ఏర్పాటు చేయడం తక్కువ ధరలకు వస్తువులను అందించడంతో పాటు డిజిటల్ షాపింగ్ సౌకర్యం కూడా కల్పించనుండడంతో ఆయా ప్రాంతాలలో వ్యాపారం నిర్వహిస్తూ పొట్టపోసుకుంటున్న వారి భవితకు ప్రమా దం ఏర్పడే అవకాశం ఉందని వారు విశ్లేషిస్తున్నారు. రిలయన్స్ స్టోర్స్ కారణంగా చిన్నచిన్న కిరాణా దుకాణాలు, కూరగాయల దుకాణాలు, ఎలక్ట్రానిక్స్, గాడ్జెట్స్ దుకాణాల వారి వ్యాపారాలు దెబ్బతినే అవకాశం ఉందని వారు విశ్లేషిస్తున్నారు. ఇదే జరిగితే రానున్న రోజుల్లో కొన్ని వేల కుటుంబాల వారు వీధిన పడే అవకాశం ఉందని వారు చెబతున్నారు. జియో రాకతో టెలికాం రంగంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయో.. స్మార్ట్ పాయింట్ల రాకతో రిటైల్ కిరాణా రంగంలోనూ అదే తరహా పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.



## మార్కెట్లోకి హ్యుందాయ్ కొత్త కారు

**న్యూఢిల్లీ:** హ్యుందాయ్ మోటార్స్ ఇండియా (హెచ్‌ఐఎంఎల్) మంగళవారం దేశ మార్కెట్లోకి తన సరికొత్త ఆరా కాంపాక్ట్ సెడాన్ కారును విడుదల చేసింది. దీని ధరల శ్రేణిని కంపెనీ రూ. 5.79 లక్షలు నుంచి రూ.9.22 లక్షలుగా నిర్ణయించింది. ఫైరీ రెడ్, పోలార్ వైట్, టైఫూన్ సిల్లార్, టైటాన్ గ్రే, ఆల్ఫాబ్లూ వింటేజ్ బ్రౌన్ లాంటి ఆరు రంగుల్లో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఆరా కాంపాక్ట్ సెడాన్‌లో బీఎస్-6 ఉద్గార ప్రమాణాల కనుగుణంగా మూడు రకాల ఇంజిన్ ఆప్షన్స్‌లో సంస్థ అందుబాటులోకి తెచ్చింది. ఈ కొత్త సెడాన్ కారును హ్యుందాయ్ సంస్థ ఐ10 నియోస్ మోడల్‌ను పోలిన స్టయిల్‌తో సరికొత్తగా డిజైన్ చేసింది. పలు అత్యాధునిక భద్రతా ప్రామాణాలతో పాటు కొత్త స్టైల్‌కు మారుపేరుగా ఆరాను తాము రూపొందించినట్టుగా సంస్థ తెలిపింది.




## జొమాటో చేతుల్లోకి ఉబెర్ ఈట్స్ సంస్థ

### -రూ.2485 కోట్లకు కుదిరిన భారీ డీల్..!

**న్యూఢిల్లీ :** భారత్‌కు చెందిన ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో ఏకంగా అమెరికాకు చెందిన ఉబెర్ టెక్నాలజీస్‌కు చెందిన ఉబెర్ ఈట్స్ భారత విభాగాన్ని స్వాధీనం చేసుకుంది. ఈ మేరకు ఆ రెండు సంస్థలు దాదాపు రూ.2500 కోట్ల విలువైన వ్యాపార ఒప్పందం చేసుకొన్నాయని సమాచారం. అందుకు ప్రతిగా ఉబెర్‌కు జొమాటోలో 10 శాతం వాటా లభిం చింది. దీంతో ఉబెర్ ఈట్స్ జొమాటోతో విలీనంమైంది. అదే విధంగా ఉబెర్ ఈట్స్ వినియోగదారులందరినీ జొమాటోకు బదలాయించారు. జనవరి 21 నుంచి ఉబెర్ ఈట్స్ తన కార్యక లాపాలను నిలిపివేసిందని, ఆ సంస్థ ఖాతాదారులందరూ జొమాటోకి బదిలీ అయ్యారని జొమాటో వ్యవస్థాపకులు దీపిందర్ గోయల్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఫుడ్ డెలివరీ వ్యాపారంలో దేశవ్యాప్తంగా 500 నగరాల్లో విస్తరించామని చెప్పడానికి ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ ఒప్పందంతో మా వ్యాపారం మరింత వద్ధిలోకి వస్తుందని ఆకాంక్షించారు. కాగా ఈ ఒప్పందంపై ఉబెర్ ఈట్స్ స్పందిస్తూ ఇంతకాలం ఉబెర్ ఈట్స్‌ను ఆదరించిన తమ కస్టమర్లందరూ ఇక నుంచి జొమాటోలో మరిన్ని ఎక్సైటింగ్ ఆఫర్లతో ఫుడ్‌ను ఎంజారు చేస్తారని పేర్కొంది. అయితే ఉబెర్ ఈట్స్ ఉద్యోగులను మాత్రం స్వీకరించడానికి ఆసక్తిగా లేదని సమాచారం. భారత్‌లో పనిచేస్తున్న 100 మంది ఎగ్జిక్యూటివ్‌లకు పదవీ విరమణ ఇవ్వడంగానీ, లేదా వేరే విభాగాలకు మళ్లించనున్నారు.



# అందాల ముద్దుగుమ్మ

కన్నడ సినిమా గిల్లి తో 2009 లో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. ఈ అమ్మడు తెలుగు లో 2011 సంవత్సరంలో కెరటం సినిమా తో ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమా నిరాశ పరిచినా కూడా 2013 లో వచ్చిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమా ఆమె కెరీర్ కి టర్నింగ్ పాయింట్. లౌక్యం, పండగ చేస్కో, సరైనోడు, ధృవ, నాన్నకు ప్రేమతో, స్పైడర్ ఇలా వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో దాదాపు అయిదు ఆరు ఏళ్ల పాటు నటించిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ కు గత కొంత కాలంగా ఆఫర్లు చాలా తక్కువ అయ్యాయి. ఈ మధ్య కాలంలో రకుల్ సోషల్ మీడియాకే పరిమితం అయ్యింది. సినిమాలు పెద్దగా చేయకున్నా కూడా రకుల్ ప్రీత్ సింగ్ కు ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ఆమె సోషల్ మీడియా పోస్ట్ లకు వస్తున్న రీచ్ ను బట్టి అర్థం అవుతుంది. హీరోయిన్ గా రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ పూర్వ వైభవం తెచ్చుకుని తీరుతుంది అంటూ ఇలాంటి ఫోటోలు షేర్ చేసిన సమయంలో నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాజా రెడ్ డ్రెస్ లో అందాల విందు చేస్తూ రకుల్ షేర్ చేసిన ఈ ఫోటోలు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. క్లోజప్ లో అందాల రకుల్ ఎద సౌందర్యంకు నెటిజన్స్ నోరు వెళ్లబెడుతున్నారు. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ రకుల్ ప్రీత్ సింగ్ సొంతం అంటూ ఈ ఫోటోలతో మళ్లీ నిరూపితం అయ్యింది. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో ఒక హిందీ సినిమా మరియు ఒక తమిళ సినిమా ఉంది. ఈ రెండు సినిమాలు విజయాలను సొంతం చేసుకుంటే సౌత్ మరియు నార్త్ లో ఈ అమ్మడు బిజీ అయ్యేనా అనేది చూడాలి. టాలీవుడ్ లో కూడా ఈ అమ్మడు మళ్లీ నటించాలని ఆశ పడుతుంది.

## సినీ వాయిస్ CINEMA



# మతి చెడింది ఇందుకే

తాజాగా తాప్సీ పన్ను షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో గుబులు రేపుతోంది. మునుపటి కంటే ముగ్ధ మనోహరంగా కనిపిస్తోంది ఈ లుక్ లో. అవును..! మాథియాస్ బో అందుకే పడిపోయాడు తాప్సీకి. దాదాపు దశాబ్ధ కాలం పాటు సుదీర్ఘంగా ప్రేమాయణం సాగించిన తాప్సీ పన్ను అతడితో పరిచయం అయిన వెంటనే పడిపోలేదు. మొదటి చూపులోనే ప్రేమలో పడిపోలేదని ఇంతకుముందే తాప్సీ వెల్లడించింది. అతడు బోలెడన్ని టెస్టులు పాసయ్యాకే ప్రేమలో పడ్డానని తాప్సీ తెలిపారు. అయితే మాథియాస్ బో తాప్సీకి ఎందుకు పడిపోయి ఉండొచ్చు! అంటే.. ఇదిగో ఇక్కడ సమాధానం స్పష్టంగా ఉంది. తాప్సీ ఒక తెలుగింటి అమ్మాయిలా.. భారతీయ వనితలా చీరలో కవ్విస్తున్న తీరు దీనికి కారణం కావొచ్చు. విదేశీ వనితలతో పోలిస్తే భారతీయ స్త్రీల అందం హొయలు అంతా చీరలోనే దాగి ఉంది. అందుకే తాప్సీని చీరలో చూసి అతడు ఫ్లాట్ అయిపోయి ఉంటాడని అభిమానులు ఊహిస్తున్నారు. ప్రఖ్యాత కాస్మోపాలిటన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తాప్సీ తన ప్రేమాయణం గురించి ఓపెనైంది. మాజీ బ్యాడ్మింటన్ ఆటగాడు, కోచ్ అయిన మాథియాస్ బో ఇటీవలే తాప్సీని పెళ్లాడిన సంగతి తెలిసిందే. ఇది రహస్య పెళ్లి కావడంతో పూర్తిగా బయటి ప్రపంచానికి క్లారిటీ లేదు. మరోవైపు తాప్సీ పన్ను పెళ్లి తర్వాత వరుస ఫోటోషూట్లతో అభిమానులకు టచ్ లోకి వస్తోంది. తాజాగా తాప్సీ పన్ను షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో గుబులు రేపుతోంది. మునుపటి కంటే ముగ్ధ మనోహరంగా కనిపిస్తోంది ఈ లుక్ లో. ఎర్ర కోకలో తాప్సీ అందచందాలు మతులు చెడగొడుతున్నాయి. అలా నది ఒడ్డున ఆహ్లాదంగా ప్రశాంతవదనంతో తాప్సీ ఒక అందమైన పుష్పాన్ని వీక్షిస్తూ మైమరిచిపోయి కనిపిస్తోంది. ఆ రింగుల జుత్తు.. కాలికి కట్టిన తాయత్తు కాంబినేషన్ ఏంటో కానీ గమ్మత్తయిన తాప్సీ వ్యక్తిత్వానికి సింబాలిక్ గా కనిపిస్తున్నాయ్. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా దూసుకెళుతోంది. మాథియాస్ బో మతి చెడిపోయింది ఇందుకేనా?



# లైగర్ బ్యూటీ చిల్ మూడ్ ఫోజ్

బాలీవుడ్ స్టార్ నటుడు చుంకీ పాండే కూతురు అనన్య పాండే బాలీవుడ్ లో స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 సినిమాతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. టాలీవుడ్ లో విజయ్ దేవరకొండతో కలిసి లైగర్ సినిమాలో నటించింది. లైగర్ సినిమా నిరాశ పరచడంతో బాలీవుడ్ కే పరిమితం అయ్యింది. ప్రస్తుతం హిందీలో రెండు మూడు సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాధారణంగా అనన్య పాండే రెగ్యులర్ గా స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తూ ఉంటుంది. కానీ ఈసారి స్కిన్ షో చేయకుండా విభిన్నమైన ఔట్ ఫిట్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కాస్ట్యూమ్ లో కూడా భలే ఉందే అంటూ నెటిజన్స్ అనన్య పాండే షేర్ చేసిన ఈ పిక్స్ గురించి మాట్లాడుతున్నారు. చిల్ మూడ్ లో ఉన్నట్లుగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చి ఆకట్టుకుంది. లైట్ పింక్ కలర్ డ్రెస్ లో అందాల అనన్య పాండేను చూడటం బాగుంది అన్నట్లుగా కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో అనన్య పాండే గత ఫోటోల మాదిరిగానే ఈ ఫోటోలు కూడా వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ లో మళ్లీ ఈ అమ్మడు సినిమాలు చేయాలని కోరుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. స్టార్ హీరోలకు ముందు ముందు ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్ అయ్యే అవకాశాలు లేక పోలేదు.

## క్రీడా వాయిస్

# టాస్ లేకుండానే దేశవాళీ సీజన్

## షెడ్యూల్ విడుదల చేసిన బిసిసిఐ




భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) దేశవాళీ క్రికెట్ 2024-25 షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది నుంచి జరిగే దేశవాళీ సీజన్‌లో టాస్ వేయకుండానే మ్యాచ్‌లు జరగనున్నాయి. అదెలాగంటే.. టాస్ బదులు పర్యాటక జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్ ఎంచుకొనే అవకాశమిస్తారు. ఇది ఈ ఏడాది సికె నాయుడు ట్రోఫీ సరికొత్తగా ఉండనుంది. ఇక సెప్టెంబర్‌లో దులీప్ ట్రోఫీతో దేశవాళీ సీజన్ ఆరంభం కానుంది. అనంతపురం వేదికగా సెప్టెంబర్ 5న తొలి మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో పురుషుల సీనియర్ సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన నాలుగు జట్లు పాల్గననున్నాయి. అనంతరం వరుసగా ఇరానీ కప్, రంజీట్రోఫీలు నిర్వహించనున్నారు. అయితే.. ఈసారి రెండు విడతలుగా రంజీ పోటీలు జరిపేందుకు బిసిసిఐ నిర్ణయించింది. రెడ్ బాల్ క్రికెట్ టోర్నీలు పూర్తవ్వగానే వైట్ బాల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. తొలుత సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ.. ఆ తర్వాత విజరు హజారే ట్రోఫీ ఉంటుంది. ఈ రెండు టోర్నీలు ముగిశాక రంజీట్రోఫీ రెండో విడతల్లో జరగనుంది. మ్యాచ్ ఏదైనా సరే టాస్ వేయడం పరిపాటి. కానీ, ఈసారి సీకే నాయుడు ట్రోఫీ సరికొత్త ఒరవడికి నాంది పలుకనుంది. ఈ టోర్నీలో ఇకపై టాస్ వేయకుండానే మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

# ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు అల్కరాజ్

## ఐదుసెట్ల హోరాహోరీ సెమీస్‌లో సిన్నర్‌పై గెలుపు



స్పెయిన్ యువ సంచలనం, 3వ సీడ్ కార్లోస్ అల్కరాజ్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. రొలాండ్ గారోస్‌లో హోరాహోరీగా సాగిన ఐదుసెట్ల తొలి సెమీస్‌లో అల్కరాజ్ 2వ సీడ్, ఇటలీకి చెందిన జన్నిక్ సిన్నర్‌ను చిత్తుచేశాడు. గత ఏడాది ఈ టోర్నమెంట్ సెమీస్‌కు చేరినా.. నొవాక్ జకోవిచ్ చేతిలో ఓడి ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. 2023లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన అల్కరాజ్‌కు ఆ ఏడాది నిరాశ ఎదురైనా.. ఈసారి 3వ సీడ్‌గా బరిలోకి దిగి ఏకంగా 2వ సీడ్, ఇటలీకి చెందిన జన్నిక్ సిన్నర్‌ను ఓడించి ఫైనల్‌కు చేరడం విశేషం. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన తొలి సెమీస్‌లో అల్కరాజ్ 2-6, 6-3, 3-6, 6-4, 6-3తో 2వ సీడ్ జన్నిక్ సిన్నర్‌పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లు ఇరువురు ఏడు చొప్పున ఏస్‌లను సంధించగా.. తొలి సర్వ్‌ను 64శాతం విజయంతంగా ముగించి మ్యాచ్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. అనవసర తప్పిదాలు ఎక్కువ చేసిన సిన్నర్ ఓటమిపాలై ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. ఈ ఏడాది సూపర్ ఫామ్‌లో ఉన్న 21ఏళ్ల అల్కరాజ్ గత ఏడాది వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకొన్నాడు. అలాగే 2022లో తొలిసారి యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకొని కెరీర్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల వేటను మొదలు పెట్టాడు. సెమీస్‌లో గెలుపుతో అల్కరాజ్ 2024 ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచాడు. 2వ సీడ్‌గా ఫ్రెంచ్ ఓపెన్ బరిలోకి దిగిన సిన్నర్.. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకొని అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను నెగ్గి తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సిన్నర్ తన ఖాతాలో వేసుకున్నాడు. అలాగే ఏటిపి ర్యాంకింగ్స్‌లోనూ నొవాక్ జకోవిచ్ తర్వాత 2వ స్థానంతో ఫ్రెంచ్ ఓపెన్ బరిలోకి దిగిన సిన్నర్ జోరుకు అల్కరాజ్ కళ్లెం వేశాడు. ప్రి క్వార్టర్స్‌లో నొవాక్ జకోవిచ్ గాయం కారణంగా టోర్నీనుంచి అర్థాంతరంగా వైదొలగడంతో అల్కరాజ్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు మార్గం సుగమమైంది. అల్కరాజ్ ఫైనల్‌కు చేరే క్రమంలో క్వార్టర్స్‌లో 9వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్), ప్రి క్వార్టర్స్‌లో 21వ సీడ్ అగర్ అలియమే(కెనడా), 3వ రౌండ్‌లో 27వ సీడ్ కొర్డా(అమెరికా)లను చిత్తుచేశాడు. 7వ సీడ్ రూథ్(డెన్మార్క్), 4వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ)ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో అల్కరాజ్ ఫైనల్లో తలపడనున్నాడు.




# నమీబియాపై స్కాట్లాండ్ విజయం

ఐసిసి టి20 ప్రపంచకప్‌లో స్కాట్లాండ్ జట్టు తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇంగ్లండ్‌తో జరగాల్సిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కాగా.. రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు నమీబియాపై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గ్రూప్‌బిలో భాగంగా బ్రిడ్జ్‌టౌన్‌లో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 155పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని స్కాట్లాండ్ జట్టు 18.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నమీబియా ఓపెనర్ కోర్జే(0) నిరాశపరిచినా.. డావిన్(20)కి తోడు కెప్టెన్ ఎరాస్మస్(52) అర్థసెంచరీతో రాణించాడు. ఆ తర్వాత వికెట్ కీపర్ గ్రీన్(28) కూడా రాణించడంతో నమీబియా జట్టు గౌరవప్రద స్కోర్‌ను నమోదు చేసింది. స్కాట్లాండ్ బౌలర్లు వీల్‌కు మూడు, క్యారీకి రెండు, సోలే, గ్రీవ్స్, లీస్క్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం స్కాట్లాండ్ ఓపెనర్ మూన్సే(7) నిరాశపరిచినా.. జోన్స్(26), ముల్లెన్(19)కి తోడు కెప్టెన్ బెర్రింగ్టన్(47నాటౌట్), లీస్క్(35) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో స్కాట్లాండ్ జట్టు మరో 9బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది. నమీబియా బౌలర్లు ఎరాస్మస్‌కు రెండు, స్కోల్జ్, లంగ్మెని, ట్రంపెల్మన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లీస్క్‌కు లభించింది.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com